మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

మంగళవారం 13-10-2026

పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 312

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను

తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

# దద్దరిల్లిన ఢిల్లీ

రాహుల్ గాంధీ నేతృత్వంలో సుప్రీంకోర్టు దిశగా భారీ ర్యాలీ



ప్రజాస్వామ్యం కోసం ఇండియా కూటమి మహా ప్రదర్శన

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఓటర్ల జాబితా సవరణల్లో అక్రమాలపై న్యాయపరమైన చర్యలు కోరిన విపక్షాలు
- బారికేడ్లతో ర్యాలీని అడ్డుకున్న ఢిల్లీ పోలీసులు
- కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి పార్టీల నేతల భాగస్వామ్యం
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసేందుకు విపక్ష నేతల యత్నం
- పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- వీధి నిరసనతో పాటు న్యాయపోరాటానికి కాంగ్రెస్ సిద్ధం

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు కాపాడాలనే డిమాండ్లతో దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నేతలు భారీ ప్రదర్శన నిర్వహించారు. 'చలో ఢిల్లీ--మార్చ్ ఫర్ డెమోక్రసీ' నినాదంతో సుప్రీంకోర్టు దిశగా సాగిన ఈ ర్యాలీని పోలీసులు బారికేడ్లతో అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్ సహా పలువురు విపక్ష నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నికల వ్యవహారంపై తమ అభ్యంతరాలను వివరించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసేందుకు విపక్ష నేతలు ప్రయత్నించగా, న్యాయపరమైన పరిష్కారం కోరేవారు పిటిషన్ దాఖలు చేసుకోవాలని ఆయన సూచించినట్లు సమాచారం. దీంతో వీధి నిరసనలతో పాటు న్యాయపోరాటం ద్వారానూ ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెంచేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి.



03



# తిరుపతికి మహర్దశ

అభివృద్ధి పనులకు రూ.3,222 కోట్లు



- అలిపిరి వద్ద యాత్రికుల టౌన్‌షిప్‌కు శంకుస్థాపన
- రోజుకు 15 వేల మంది భక్తులకు వసతి
- రూ.242 కోట్లతో తొమ్మిది రహదారులు
- 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు
- వెంకటాద్రి యాప్‌ను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- వివాహాలు, క్రీడలకు కేంద్రంగా తిరుపతి
- ఆధ్యాత్మికత, ఆధునికత కలగలిసిన ఆదర్శ నగరం

అమరావతి,

తిరుపతిని అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. సచివాలయం నుంచి వర్చువల్‌గా తుడా, టీటీడీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. అలిపిరి సమీపంలో రూ.2,750 కోట్లతో నిర్మించనున్న సమైక్య యాత్రికుల టౌన్‌షిప్‌కు శంకుస్థాపన చేయడంతో పాటు, వెంకటాద్రి యాప్‌ను ఆవిష్కరించారు. తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ ఓ శుభవార్త అందించింది. కొండపైకి వచ్చే యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా మ్యాప్‌లు, వసతి గదులు, అన్నప్రసాద కేంద్రాలు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సులభంగా

-మిగతా 3 లో



03

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు
- తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర అర్లేకర్
- కేరళకు ఓం ప్రకాశ్ మాథుర్ బదిలీ
- ఒడిశా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ నియామకం
- కర్ణాటకకు సుధా యాదవ్ ఎంపిక
- ఉత్తరాఖండ్ గవర్నర్‌గా ధాల్ సింగ్ బిసేన్
- సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్
- ఆరు రాష్ట్రాల్లో గవర్నర్ల బాధ్యతల్లో మార్పులు



03

## ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణుల పరీక్షలు

- తూర్పు సముద్ర జలాల దిశగా క్షిపణుల ప్రయోగం
- ప్యోంగ్యాంగ్ నుంచి పరీక్షించినట్లు దక్షిణ కొరియా వెల్లడి
- ఓ క్షిపణి 900 కిలోమీటర్లకు పైగా ప్రయాణించినట్లు సమాచారం
- 17 నిమిషాల వ్యవధిలో రెండు క్షిపణులను గుర్తించిన జపాన్
- తొలి క్షిపణి 220 కిలోమీటర్లు ప్రయాణించినట్లు అంచనా
- రెండో క్షిపణి దూరం 910 కిలోమీటర్లుగా గుర్తింపు
- హైపర్‌సోనిక్ ఆయుధ పరీక్ష జరిగి ఉండొచ్చని జపాన్ అనుమానం
- కొరియా దేశాల మధ్య ఉద్రిక్తతల వేళ తాజా ప్రయోగాలు



# నేడు అమరావతికి విజయ్

- తొలుత కనకదుర్గ అమ్మవారి దర్శనం
- తర్వాత సీఎం చంద్రబాబు నివాసానికి
- నదుల అనుసంధానం, చెన్నైకు తాగునీటి సరఫరాపై తమిళనాడు సీఎం చర్చలు
- అనంతరం 'విజయవాడ ఉత్సవ్ 2.0'కు
- అక్కడే డిప్యూటీ సీఎం పవన్‌తోనూ భేటీ

అమరావతి, చెన్నై,

: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానం మేరకు తమిళనాడు సీఎం సి.జోసెఫ్ విజయ్ మంగళవారం అమరావతి రానున్నారు. చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్రం 4 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి వెళ్తారు. అమ్మవారి దర్శనానంతరం సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి చేరుకుంటారు. అక్కడ గంట పాటు చంద్రబాబుతో విజయ్ భేటీ కానున్నారు. ఈ సందర్భంగా తెలుగు గంగ పథకం కింద నెల్లూరు జిల్లా కండలేరు డ్యామ్ నుంచి చెన్నైకి ఇవ్వాల్సిన కృష్ణా జలాలు, దక్షిణ భారతదేశంలోని గోదావరి-కృష్ణా-కావేరి నదుల అనుసంధానం గురించి ఆయన చర్చించనున్నారు. రాష్ట్ర విభజన జరిగాక తొలిసారిగా తమిళనాడు ప్రభుత్వంతో నదీ జలాల

-మిగతా 3 లో



## సౌదీపై ఎడతెగని దాడులు

- క్షిపణుల వర్షం కురిపిస్తున్న హౌతీలు
- దమ్మామ్ విమానాశ్రయంపై ఎటాక్
- తాజా దాడుల్లో ఒకరు మృతి.. 11 మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో ముగ్గురు భారతీయులు.. ఐసీయూలో చికిత్స

రియాద్:

సౌదీ అరేబియాపై హౌతీ రెబెల్స్ దాడులు ఆగడం లేదు. సౌదీలోని ప్రధాన విమానాశ్రయాలపై వరుస దాడులు చేస్తున్న హౌతీలు, తాజాగా దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుపై క్షిపణులతో విరుచుకుపడ్డారు. అటు రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై మరోసారి దాడిచేశారు. తాజా దాడిలో ఒక పాకిస్తాన్ జాతీయుడు మరణించగా,

-మిగతా 3 లో

# రాష్ట్రంలో మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు




తొలిసారి మహిళలకు 50 శాతం స్థానాలు

- బీసీలకు 36, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 పీఠాలు
- ఎస్టీలకు మూడు చైర్‌పర్సన్ స్థానాలు
- జనరల్ మహిళలకు 27 మున్సిపాలిటీలు
- అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో 26 స్థానాలు
- రిజర్వేషన్ల ప్రకటనతో ఎన్నికల వేడి
- అభ్యర్థుల ఎంపికపై పార్టీల కసరత్తు

అమరావతి,

ఆంధ్రప్రదేశ్‌లోని 106 మున్సిపాలిటీల చైర్‌పర్సన్ పదవులకు ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈసారి మహిళలకు 50 శాతం స్థానాలు కేటాయించినట్లు ప్రకటించింది. రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు 36, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 స్థానాలు కేటాయించారు. జనరల్ మహిళలకు 27 స్థానాలు రిజర్వ్ చేశారు. మరో 26 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో

-మిగతా 3 లో



03

## ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది!

- జంతర్ మంతర్ గుర్తింపు రద్దుపై అభిజీత్ దీప్కే ఆగ్రహం
- నిరసనలంటేనే కేంద్రానికి సమస్య అంటూ విమర్శలు
- ప్రజాస్వామ్యాన్ని కూడా రద్దు చేస్తారా అని మోదీపై ప్రశ్న
- నిరసనలకు మూడు కొత్త వేదికలను గుర్తించిన ఢిల్లీ పోలీసులు
- ఎస్ఐఆర్ వివాదంపై జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద కట్టుదిట్టమైన భద్రత.. నిరసనకారుల అరెస్టులు

# శాంతిభద్రతలు నా పరిధిలోనివి కాదు

**భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్**



**న్యూఢిల్లీ:**
ఢిల్లీలో జరుగుతున్న నిరసనలు, ఆంక్షల పరిస్థితిపై భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సూర్యకాంత్ స్పందిస్తూ, ఇది పూర్తిగా శాంతిభద్రతలకు సంబంధించిన అంశమని, న్యాయవ్యవస్థ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై పలు ఆరోపణలతో మెమోరాండం సమర్పించేందుకు కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ కోరిన వ్యక్తిగత భేటీని ఆయన తిరస్కరించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాలపై బయట సమావేశాలు నిర్వహించడం రాజ్యాంగ సిద్ధాంతానికి, న్యాయ నైతికతకు విరుద్ధమని ఆయన తేల్చి చెప్పారు. అలా అయితే రాజీనామా చేయండి సీజేఐపై కాంగ్రెస్ వివాదాస్పద పోస్ట్ శాంతిభద్రతలు తన పరిధిలోని అంశం కాదని సీజేఐ చేసిన వ్యాఖ్యలపై కేరళ కాంగ్రెస్ విభాగం సోషల్ మీడియా వేదికగా తీవ్ర స్థాయిలో స్పందిస్తూ, శాంతిభద్రతలు మీ పరిధి కానప్పుడు వెంటనే పదవికి రాజీనామా చేయాలని, ఆ బాధ్యతలు సమర్థంగా నిర్వహించగల మరొకరిని తాము ఎంపిక చేసుకుంటామంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. అయితే దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన ఈ వ్యాఖ్యలు విమర్శలకు దారి తీయడంతో కాంగ్రెస్ పార్టీ కొద్ది గంటల్లోనే ఆ పోస్టును తొలగించింది.

## ప్రాణం తీసిన మెట్రో సీటు గొడవ

**ఢిల్లీలో మాజీ ఐఏఎస్ అధికారి అరెస్ట్**



**న్యూఢిల్లీ**
మెట్రో సీటు విషయంలో జరిగిన గొడవ చివరకు వ్యక్తి ప్రాణాలు తీసింది. ఈ నెల 8న జరిగిన ఈ ఘటన ఇప్పుడు సంచలనంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పవన శర్మ (48), ఆయన తల్లి దుర్గాదేవి (65) యమునా విహార్‌వైపు ఢిల్లీ మెట్రోలో వెళ్తున్నారు. మండి స్టేషన్ వద్ద రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సంజయ్ ప్రతాప్ సింగ్ (65), ఆయన కొడుకు సిద్దార్థ్ సింగ్ ఎక్కారు. వారు శర్మ, ఆయన తల్లి వద్దకు వచ్చి సీనియర్ సిటిజన్ సీటు విషయంలో గొడవపడ్డారు. సంజయ్ ప్రతాప్ సింగ్ పవన శర్మను చెంప మీద కొట్టాడు. దీంతో పవన శర్మ ప్రతిఘటించడంతో సిద్దార్థ్ సింగ్ కూడా దాడి చేశాడు. ఈ దాడిలో పవన్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. పోలీసులు పవన శర్మను దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. దుర్గాదేవి ఫిర్యాదుతో నిందితులు సంజయ్ ప్రతాప్ సింగ్, సిద్దార్థ్ సింగ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

## నిరసన తెలపడం ఇక ఉచితం కాదు!

**రామ్‌లీలా మైదాన్‌కు లక్షల్లో ఫీజు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 12:**
ఇక ఢిల్లీలో నిరసన తెలపడం డబ్బుతో కూడుకున్న వ్యవహారం కానున్నది. జంతర్ మంతర్‌కు ప్రత్యామ్నాయంగా నిరసనల కోసం కేటాయించిన మూడు కొత్త ప్రదేశాలలో ఒకటైన రామ్‌లీలా మైదాన్ రానున్న రెండున్నర నెలల పాటు బుకింగ్‌కు అందుబాటులో లేదు. దీని బుకింగ్ రుసుము రోజుకు రూ.50,000. దీనికి అదనంగా రూ.55,000 సెక్యూరిటీ డిపాజిట్(తిరిగి వాపసు వస్తుంది) ఉంటుంది. పన్నులతో కలిపి ఒక రోజు బుకింగ్‌కు అయ్యే ప్రారంభ ఖర్చు రూ.1.21 లక్షలు అవుతుంది అని ఒక అధికారి తెలిపారు. మైదానంలో కేవలం 150 మందికి మాత్రమే చోటు ఉంటుందని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన శాఖ ద్వారా ఈ మైదానాన్ని బుక్ చేసుకోవాలి. ఒక దరఖాస్తును ఆమోదించే ముందు ఢిల్లీ పోలీసుల నుంచి నో అబ్జెక్షన్ సరిఫికెట్(ఎన్ఓసీ) తప్పనిసరి అని అధికారులు చెప్పారు. జంతర్ మంతర్‌లో నిరసనలకు ఎటువంటి చెల్లింపు అవసరం లేదు.

# బాణసంచాకు, మతానికి సంబంధం ఏమిటి?

**-ప్రజల్లో అవగాహన ముఖ్యం**

**-ఢిల్లీలో పండగ కాలుష్యంపై సుప్రీం**



**న్యూఢిల్లీ: అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
మతానికి, బాణసంచా కాల్చడానికి సంబంధం ఏమిటని ఓ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో పండగ సీజన్‌లో వాయు కాలుష్యం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేసిన ధర్మాసనం, మత పరమైన నమ్మకాలను, పర్యావరణ ఆందోళనను పరిగణనలోనికి తీసుకొని సమతుల్య దృష్టితో కేసును విచారిస్తామని పేర్కొన్నది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ మాట్లాడుతూ ఏటా టపాసులు కాల్చే సంప్రదాయం పెరుగుతూనే ఉందన్నారు.'తమ పేరు మీద కాల్చే బాణసంచా వల్ల పిల్లలు సతమతమవుతూ అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిస్తే దేవుళ్లు దిగ్భ్రాంతి చెందుతారు' అని ఆమె వ్యాఖ్యానించారు. దీనిపై సీజేఐ సూర్యకాంత్ స్పందిస్తూ 'మతాచారాలను మేం గాయపరచం. ప్రజలు ఆత్మ పరిశీలన చేసుకోవడం అన్నిటికన్నా ఉత్తమమైన పద్ధతి. వాళ్లకు ఆ అవగాహన పెరిగేలా మీరు చర్యలు తీసుకోవచ్చు' అని అవగాహన పెంచాల్సిన అవసరాన్ని, ఉత్సవాలను బాధ్యతగా జరుపుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. దీనికి అర్పితా సింగ్ బదులిస్తూ దురదృష్టవశాత్తు ఏటా ఇదే వాదనలు పునరావృతం అవుతున్నాయని..అమల్లో మాత్రం చాలా తక్కువ పురోగతి ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. హానికరమైన బాణసంచా అమ్మకాలపై నియంత్రణ విధించడాన్ని, నిర్దిష్ట విభాగాలకు చెందిన బాణసంచా మాత్రమే మార్కెట్లో అందుబాటులో ఉండేలా చూసే అంశాన్ని పరిశీలించాలని కోర్టు ప్రతిపాదించింది. నిర్దిష్ట సమయంలో బాణసంచా కాల్చడాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ వారిలో అవగాహన పెంచే కర పత్రాలను ప్రచురించాలని సూచించింది. దీనిపై అర్పితా స్పందిస్తూ నిబంధనల అమల్లో లోపాలను ఎత్తి చూపుతూ వాటి అమలు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. వాయు నాణ్యత నిర్వహణ అథారిటీకి ఈ సూచనలను పంపాలని కోర్టు తెలిపింది.

# ఓట్ల దొంగతనంలో సీఈసీ ప్రధాన నేరస్థుడు కాదు



**న్యూఢిల్లీ: అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
ఓట్ల దొంగతనం లో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ప్రధాన నేరస్థుడు కాదని లోక్‌సభ లో కాంగ్రెస్‌పక్ష నాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీ అన్నారు. ఇప్పుడు సీఈసీ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని కోరారు. సీఈసీ వెనుక ఉండి ఈ పని చేయించిన అసలు నేరస్థులను బయటపట్టడం కోసం తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అప్రూవర్‌గా మారితే ప్రతిపక్షాలు సీఈసీని క్షమించే అవకాశం కూడా ఉందని రాహుల్‌గాంధీ అన్నారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతాయని, భారీగా భద్రతా బలగాలను మోహరించడం, నిరసనకారులపై అణచివేత చర్యలు చేపట్టడం ద్వారా ప్రభుత్వం సీఈసీని కాపాడటానికి ఎలా ప్రయత్నిస్తుందో స్పష్టమవుతోందని అన్నారు. సీఈసీకి మీరు ఇచ్చే సలహా ఏమిటని మీడియా అడుగగా.. 'మీరు అప్రూవర్‌గా మారిపోండి. మీరు ఒక నేరం చేశారు. కానీ నిజాయితీగా చెప్పాలంటే మీరు ప్రధాన నేరస్తులు కాదు. మీరు ఒక తప్పు చేశారు నిజమే. కానీ ఆ తప్పు వెనుక ఉన్న సూత్రధారులు మీరు కాదు. మీరు చేసిన పనికి కారణమైన వారి కోసమే మేం ప్రయత్నిస్తున్నాం' అని సీఈసీని ఉద్దేశించి రాహుల్‌గాంధీ అన్నారు. ఇంకా మాట్లాడుతూ.. 'మీకు ఇది చాలా సులభం. రాజీనామా చేసి తప్పుకోండి అంతే చాలు. ఎలాంటి సమస్యా ఉండదు. అలా చేస్తే బహుశా మేము మిమ్మల్ని క్షమించవచ్చు కూడా. ఎందుకంటే అది దేశానికి, రాజ్యాంగానికి చేసే సేవ అవుతుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, శ్రీ అదానీల ఒత్తిడి వల్లనే మీరు అలా చేశారని మాకు తెలుసు' అన్నారు. సీఈసీ ఎదుర్కొంటున్న ఒత్తిడి ఎలాంటిదో తమకు అర్థమైందని చెప్పారు. తాము క్షమించే గుణం ఉన్నవాళ్లమని, క్రూరులం కాదని రాహుల్‌గాంధీ అన్నారు. కానీ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని చెప్పారు. ఓట్ల దొంగతనంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు ప్రతిపక్షాల ర్యాలీకి ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## నౌకపై దాడి.. ఇద్దరు భారతీయుల గల్లంతు



**న్యూఢిల్లీ: అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
హెర్ముజ్ జలసంధిలో ఎంటీ పెట్రో డాల్ఫిన్ నౌకపై ఆదివారం దాడి జరిగింది. ఇందులో 11 మంది భారతీయ నావికులున్నారు. 9 మందిని రక్షించగా ఇద్దరు గల్లంతయ్యారు. ఒమన్‌లోని సోహార్ నౌకాశ్రయం సమీపంలో నికరగువ జెండాతో ప్రయాణిస్తున్న ఈ నౌకపై డ్రోన్ దాడి జరిగినట్టు సమాచారం. గల్లంతైన వారి కోసం స్థానిక సంస్థలతో కలిసి గాలిస్తున్నట్టు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది.మరోవైపు మార్షల్ ఐస్‌లాండ్ జెండాలతో ప్రయాణిస్తున్న ఎంటీ వాల్దెరా నౌకపై కూడా క్షిపణి దాడి జరిగిందని తెలుస్తున్నది. ఆ నౌకలోనూ 11 మంది భారత నావికులున్నారని, వారి భద్రతపై ఆరా తీస్తున్నట్టు కేంద్రమంత్రి సర్బానంద వెల్లడించారు. ఈ దాడులకు పాల్పడింది ఎవరనేది ఇంకా తెలియరాలేదు. ఈ దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. పౌర నౌకలు, ఇంధన నౌకలపై దాడులను నిలిపివేయాలని సూచించింది.

## పాకిస్థాన్‌లో ఆర్మీ శిక్షణ విమానం కూలి ఇద్దరు పైలట్లు మృతి




**ఇస్లామాబాద్ న్యూఢిల్లీ: అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
పాకిస్థాన్‌లో ఇద్దరు ఆర్మీ పైలట్లు మృతిచెందారు. శిక్షణ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అదికూలింది. బలోచిస్తాన్ రాజధాని క్వెట్టా ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు పాక్ ఆర్మీ చెప్పింది. పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ముషాక్ శిక్షణ విమానం కూలినట్లు అధికారులు చెప్పారు. పైలట్లు మేజర్ హుస్నైన్ షెహజాద్ హుమయున్, ఇన్‌స్ట్రక్టర్ కెప్టెన్ అబ్దుల్ సమద్ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. దేశాధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ ఘటన పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. జూన్ నెలలో పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ఎంఐ-17 హెలికాప్టర్ .. ముజాఫరాబాద్‌లో కూలిన ఘటనలో సిబ్బంది మొత్తం మృతిచెందిన విషయం తెలిసిందే.

# పాక్‌లో ముదురుతున్న రాజకీయ సంక్షోభం..

**- ఖైబర్ పఖ్తున్‌ఖ్వా గవర్నర్ ఇంటికి నిప్పు..!**



**న్యూఢిల్లీ: అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
పాకిస్థాన్ లో రాజకీయ సంక్షోభం తీవ్రరూపం దాలుస్తున్నది. ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్ లో అత్యవసర పరిస్థితి విధించడంతో మొదలైన నిరసనలు హింసాత్మకంగా మారాయి. నిరసనకారులు గవర్నర్ హౌస్ కు నిప్పుపెట్టారు. గవర్నర్ ఇల్లు మంటల్లో చిక్కుకున్న దృశ్యాలు సోషల్‌మీడియా లో చక్కర్లు కొడుతున్నాయి. మరోవైపు పలు నగరాల్లో పోలీసులు కాల్పులు జరుపుతున్నట్లుగా ఉన్న వీడియోలు కలకలం రేపుతున్నాయి.పరిస్థితి అదుపు తప్పుతుండటంతో రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ పార్టీ నేతృత్వంలోని ప్రావిన్షియల్ ప్రభుత్వాన్ని పక్కనపెడుతూ కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించింది. దాంతో ఆదివారం పెద్దసంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. ఇస్లామాబాద్ వరకు పీటీఐ తలపెట్టిన ర్యాలీకి కూడా భద్రతాచర్యలతో ఆటంకం ఏర్పడింది. అయితే గవర్నర్ హౌస్‌కు మంటలు ఎలా అంటుకున్నాయి..? ఎంతమేర ఆస్తి నష్టం జరిగింది..? ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా..? అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రభుత్వ అణచివేత చర్యల్లో భాగంగా స్వాబీలో 59 మంది పీటీఐ కార్యకర్తలను, ఖైబర్ జిల్లాలో మరో ఆరుగురిని అరెస్టు చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. మాజీ ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది, పీటీఐ ప్రావిన్షియల్ అధ్యక్షుడు జునైద్ అక్బర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రావిన్స్‌లోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులపై భద్రతా బలగాలను మోహరించారు. స్వాబీలో మొబైల్ ఫోన్, పీటీసీఎల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ప్రావిన్షియల్ పాలనపై పట్టు సాధించేందుకు చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గవర్నర్ పాలన విధించడాన్ని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది ప్రజాస్వామ్యంపై దాడి

మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ
డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER
మంగళవారం
13-10-2026
Ananthapuram, Kurnool, Kadapa
అనంతపురం, కర్నూల్,కడప

# ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది!

- జంతర్ మంతర్ గుర్తింపు రద్దుపై అభిజీత్ దీప్కే ఆగ్రహం
- నిరసనలంటేనే కేంద్రానికి సమస్య అంటూ విమర్శలు
- ప్రజాస్వామ్యాన్ని కూడా రద్దు చేస్తారా అని మోదీపై ప్రశ్న
- నిరసనలకు మూడు కొత్త వేదికలను గుర్తించిన ఢిల్లీ పోలీసులు
- ఎస్ఐఆర్ వివాదంపై జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద కట్టుదిట్టమైన భద్రత.. నిరసనకారుల అరెస్టులు



న్యూఢిల్లీ:
ఢిల్లీలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్ గుర్తింపును రద్దు చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుందని ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజలు నిరసన తెలపడం కేంద్రానికి సమస్యగా మారిందని విమర్శించారు. జంతర్ మంతర్ హోదాను రద్దు చేసిన ప్రధాని మోదీ, రేపు ప్రజాస్వామ్యాన్ని కూడా రద్దు చేస్తారా అని ప్రశ్నించారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. నిరసనల కోసం రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, సీబీడీ మైదానాలను కొత్త వేదికలుగా గుర్తించారు. మరోవైపు, ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) వివాదంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు, సీజేపీ ఆందోళనలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద భద్రతను పెంచి, నిరసనకారులను పోలీసులు అరెస్టు చేస్తున్నారు.

# ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు
- తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర అర్లేకర్
- కేరళకు ఓం ప్రకాశ్ మాథుర్ బదిలీ
- ఒడిశా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ నియామకం
- కర్ణాటకకు సుధా యాదవ్ ఎంపిక
- ఉత్తరాఖండ్ గవర్నర్‌గా ధాల్ సింగ్ బిసేన్
- సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్
- ఆరు రాష్ట్రాల్లో గవర్నర్ల బాధ్యతల్లో మార్పులు



న్యూఢిల్లీ:
ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కేరళ గవర్నర్‌గా ఉంటూ తమిళనాడుకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు తమిళనాడు పూర్తి స్థాయి గవర్నర్‌గా బాధ్యతలు అప్పగించారు. సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళకు బదిలీ చేశారు. ఇక ఒడిశా గవర్నర్‌గా మాజీ ఎంపీ బ్రజ్ మోహన్‌ను నియమించారు. మాజీ ఎంపీ సుధా యాదవ్‌కు కర్ణాటక గవర్నర్ బాధ్యతలు అప్పగించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ధాల్ సింగ్ బిసేన్‌ను ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమించారు. బీజేపీ మాజీ నేత దుష్యంత్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. తాజా నియామకాలతో ఆరు రాష్ట్రాల్లో గవర్నర్ల బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి.

# సౌదీపై ఎడతెగని దాడులు

మొదటి తరువాయి



మరో 11 మంది గాయపడినట్లు సౌదీ ప్రభుత్వం వెల్లడించింది. దాడుల వల్ల విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌లో చెలరేగిన మంటలను అదుపు చేసినట్లు పేర్కొంది. మరోవైపు సౌదీ ఇంధన దిగ్గజం అరామ్‌కోకు చెందిన రెండు కేంద్రాలపై కూడా దాడులు చేసినట్లు హౌతీలు ప్రకటించారు. దశాబ్దకాలంలో సౌదీ భూభాగంపై జరిగిన అత్యంత ఘోరమైన దాడుల్లో ఆదివారం హౌతీలు చేసిన దాడి ఒకటి. సౌదీ రాజధానిలోని రవాణా కేంద్రాలను తమ దళాల యుద్ధక్షేత్రంగా హౌతీలు అభివర్ణించారు. వాటిపై ఇంకా దాడులు కొనసాగిస్తామని హెచ్చరించారు. అలా ప్రకటించిన కొద్ది గంటలకే కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఓ క్షిపణి తాకిందని, అక్కడ మంటలు చెలరేగాయని సౌదీ సంకీర్ణ దళాలు వెల్లడించాయి. మరో క్షిపణిని గాలిలోనే తమ దళాలు అడ్డుకున్నాయని పేర్కొంది. దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌పై డ్రోన్‌ను కూల్చేశామని తెలిపింది. అలాగే సోమవారం తెల్లవారుజామున, దక్షిణ సౌదీ నగరంలోని ఖమీస్ ముషైత్ సైనిక స్థావరం వైపు దూసుకొచ్చిన హౌతీ బాలిస్టిక్ క్షిపణిని కూడా అడ్డుకుని, ఉంటుందని వెల్లడించారు. సదస్సుకు హాజరైన అంతర్జాతీయ ప్రతినిధుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, అయితే ముప్పు పూర్తిగా తొలగిపోయిందని భావించరాదని సూచించారు.

**ఐసీయూలో ముగ్గురు భారతీయులు**

రియాద్‌లో ఉన్న కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడిలో గాయపడిన ముగ్గురు భారతీయులు ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం సోమవారం వెల్లడించింది.

# నేడు అమరావతికి విజయ్

మొదటి తరువాయి

అంశంపై ఉన్నతస్థాయి సమావేశం జరగనున్నది. ఈ భేటీ తరువాత అక్కడి నుంచి బయలుదేరి రాత్రి 7.10 గంటలకు పున్నమి ఘాట్‌లోని ఉత్సవ్ గ్రౌండ్‌కు విజయ్ చేరుకుంటారు. 'విజయవాడ ఉత్సవ్ 2.0'లో కళా ప్రదర్శనలు వీక్షించి ప్రసంగిస్తారు. అక్కడే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కూడా విజయ్ కలుసుకుంటారని తమిళనాడు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం అనంతరం 8.50 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని చెన్నై పయనమవుతారు. ఇప్పుడు రెండోసారి భేటీ కానున్నారు. విజయ్ తమిళనాడు సీఎం అయ్యాక ఏపీకి రానుండటం ఇదే తొలిసారి. ఆయన పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# దద్దరిల్లిన ఢిల్లీ

- రాహుల్ గాంధీ నేతృత్వంలో సుప్రీంకోర్టు దిశగా భారీ ర్యాలీ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఓటర్ల జాబితా సవరణల్లో అక్రమాలపై న్యాయపరమైన చర్యలు కోరిన విపక్షాలు
- బారికేడ్లతో ర్యాలీని అడ్డుకున్న ఢిల్లీ పోలీసులు
- కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి పార్టీల నేతల భాగస్వామ్యం
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసేందుకు విపక్ష నేతల యత్నం
- పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- వీధి నిరసనతో పాటు న్యాయపోరాటానికి కాంగ్రెస్ సిద్ధం





న్యూఢిల్లీ,
కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భారీ ర్యాలీతో దేశ రాజధాని ఢిల్లీ రాజకీయంగా వేడెక్కింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియా కూటమి నేతలు 'చలో ఢిల్లీ--మార్చ్ ఫర్ డెమోక్రసీ' నినాదంతో సుప్రీంకోర్టు దిశగా ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ర్యాలీ సుప్రీంకోర్టు వైపు సాగుతుండగా భగవాన్ దాస్ రోడ్డు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు నిరసనకారులను అడ్డుకున్నాయి. దీంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ఓటు హక్కును పరిరక్షించాలని, సీఈసీ రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ కార్యకర్తలు ముందుకు సాగేందుకు ప్రయత్నించారు. ర్యాలీకి ముందు నుంచే కానాట్ ప్లేస్, మండీ హౌస్ పరిసరాల్లో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు గుమిగూడారు. ఈ నిరసనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు తదితరులు పాల్గొన్నారు. ఇండియా కూటమిలోని వివిధ పార్టీల నాయకులు కూడా నిరసనకు మద్దతు తెలిపారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ర్యాలీలో పాల్గొనడంతో కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించింది. మరోవైపు, ఎన్నికల వ్యవహారంపై తమ అభ్యంతరాలను వివరించేందుకు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. అయితే, ఈ అంశాలు ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధి బృందాన్ని ప్రత్యక్షంగా కలవడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. సమస్యపై న్యాయపరమైన పరిష్కారం కోరేవారు పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించారు. చట్ట ప్రకారం పిటిషన్లను పరిశీలిస్తామని పేర్కొన్నారు. సీజేఐని కలిసి వినతిపత్రం సమర్పించాలన్న ప్రయత్నం ఫలించకపోవడంతో, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా న్యాయపోరాటం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు కథనం పేర్కొంది. వీధుల్లో నిరసనలతో పాటు న్యాయస్థానంలో పిటిషన్ ద్వారా కూడా ఎన్నికల వ్యవహారంపై ఒత్తిడి పెంచేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అభ్యంతరాలు తాజా రాజకీయ పరిణామాలతో మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# తిరుపతికి మహర్దశ

మొదటి తరువాయి

చేరుకునేందుకు వెంకటాద్రి పేరుతో ఒక నూతన నావిగేషన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది.

**భక్తులకు మెరుగైన సౌకర్యాలు**

అలిపిరి సమీపంలోని ఎస్వీ జూపార్కు రహదారి వద్ద నిర్మించనున్న టౌన్‌షిప్‌లో వసతి, అన్నప్రసాదం, పార్కింగ్, రవాణా, వైద్య సేవలు, డిజిటల్ సమాచార కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

-రూ. 1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు నిర్మించి రోజుకు 15 వేల మంది భక్తులకు వసతి కల్పిస్తున్నారు.

- రూ. 160 కోట్లతో అన్నప్రసాద కేంద్రం, రూ. 311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ. 90 కోట్లతో 30 బస్ బేలతో రవాణా టెర్మినల్ నిర్మించనున్నారు.





**రూ. 242 కోట్లతో మాస్టర్ ప్లాన్ రహదారులు**

తిరుపతిలో రూ. 242 కోట్లతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులను అభివృద్ధి చేయనున్నారు. మొత్తం 20 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ పనులతో నగరంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. జాతీయ రహదారుల అనుసంధానంతో పాటు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు ప్రయాణ సౌలభ్యం కలగనుంది.

**టీటీడీ ఉద్యోగులకు నివాస స్థలాలు**

టీటీడీ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ను అభివృద్ధి చేస్తున్నారు. రెండో దశలో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కల్పించేందుకు మౌలిక సదుపాయాలపై రూ. 230 కోట్లు ఖర్చు చేయనున్నారు. రహదారులు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ తదితర సదుపాయాలతో ఈ ప్రాంతాన్ని పర్యావరణహితంగా, నెట్‌జీరో లక్ష్యంతో అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు.

**ఆధ్యాత్మికతకు ఆధునిక సాంకేతికత**

తిరుమల చరిత్ర, శ్రీవారి వైభవాన్ని భక్తులకు పరిచయం చేసేలా యాత్రికుల అనుభూతి కేంద్రాలను ఏర్పాటు చేయాలని చంద్రబాబు సూచించారు. తిరుపతిలోని చెరువులను అనుసంధానించి సుందరీకరించాలని, ఔషధ మొక్కల ప్రాంతాన్ని ప్రకృతి అనుభూతి కేంద్రంగా అభివృద్ధి చేయాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

**వివాహాలు, క్రీడలకు కేంద్రంగా తిరుపతి**

అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ హాల్‌ను ఏర్పాటు చేసి తిరుపతిని వివాహ వేడుకలకు ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు ఏసీపీ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు పెంచాలని చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి తిరుపతిని ఆధ్యాత్మికత, పర్యాటకం, పర్యావరణ పరిరక్షణ కలగలిసిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, అరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్, తుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణుల పరీక్షలు



సియోల్:
ఉత్తర కొరియా తన ఆయుధ సామర్థ్యాన్ని పెంచుకునే ప్రయత్నాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా పలు బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించినట్లు దక్షిణ కొరియా సైనిక వర్గాలు వెల్లడించాయి. తూర్పు సముద్ర జలాల దిశగా ఈ ప్రయోగాలు జరిగినట్లు తెలిపాయి. కొరియా దేశాల మధ్య ఇప్పటికే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. దక్షిణ కొరియా సంయుక్త దళాల ప్రతినిధి జాంగ్ డో యుంగ్ వివరాల ప్రకారం.. ఉత్తర కొరియా రాజధాని ప్యోంగ్యాంగ్ నుంచి క్షిపణులను ప్రయోగించినట్లు గుర్తించారు. ఆ దేశం గత కొన్నేళ్లుగా ప్రధాన విమానాశ్రయాన్ని కీలక క్షిపణి ప్రయోగ కేంద్రంగా ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. పరీక్షించిన క్షిపణుల్లో ఒకటి సుమారు 900 కిలోమీటర్లకు పైగా ప్రయాణించినట్లు జాంగ్ వెల్లడించారు. అయితే ఎన్ని క్షిపణులను గుర్తించారన్న విషయాన్ని ఆయన స్పష్టం చేయలేదు. జపాన్ ఉప రక్షణ మంత్రి తకాషి కోయరి వెల్లడించిన వివరాల ప్రకారం.. 17 నిమిషాల వ్యవధిలో రెండు క్షిపణులను గుర్తించారు. వాటిలో మొదటిది సుమారు 220 కిలోమీటర్లు, రెండోది దాదాపు 910 కిలోమీటర్లు ప్రయాణించినట్లు అంచనా వేశారు. ఈ క్షిపణులు జపాన్ ప్రత్యేక ఆర్థిక మండలికి వెలుపల ఉన్న సముద్ర జలాల్లో పడినట్లు సమాచారం. ఈ ప్రయోగాల వల్ల విమానాలు, నౌకలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని జపాన్ అధికారి తెలిపారు. ఉత్తర కొరియా హైపర్‌సోనిక్ ఆయుధాన్ని పరీక్షించి ఉండవచ్చని జపాన్ వర్గాలు అనుమానిస్తున్నాయి. అయితే ఈ అంశంపై స్పష్టమైన నిర్ధారణ వెలువడలేదు. అణ్వాయుధాలను ప్రయోగించగల సామర్థ్యాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు ఉత్తర కొరియా చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. తాజా క్షిపణి పరీక్షల నేపథ్యంలో ప్రాంతీయ భద్రత, కొరియా దేశాల మధ్య సంబంధాలపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## రాష్ట్రంలో మున్సిపల్

# రిజర్వేషన్లు ఖరారు

మొదటి తరువాయి

ఉంచారు. బీసీ మహిళల విభాగంలో జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, గంతకల్లు, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం ఉన్నాయి. ఎస్సీ మహిళలకు కొండపల్లి, నిడదవోలు, ఏలేశ్వరం, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల కేటాయించారు. ఎస్టీ మహిళల విభాగంలో గూడూరు ఉండగా, ఆత్మకూరు, ఆలూరు ఎస్టీ జనరల్ కేటగిరీలో ఉన్నాయి. ఎస్సీ జనరల్ విభాగంలో ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి ఉన్నాయి. జనరల్ మహిళల కేటగిరీలో కనిగిరి, వెంకటగిరి, నరసాపురం, పలాస -- కాశీబుగ్గ, పెదన, పలమనేరు, జమ్మల మడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాలెం, ఎర్రగుంట, యలమంచిలి, కళ్యాణదుర్గం, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆటోని, దోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు ఉన్నాయి. ఈ రిజర్వేషన్ల ప్రకటనతో పురపాలక ఎన్నికలపై రాజకీయ పార్టీల దృష్టి కేంద్రీకృతమైంది. కేటగిరీల వారీగా అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహాలపై పార్టీలు కసరత్తు చేసే అవకాశం ఉంది.



## సంపాదకీయం

# దేశానికే దిక్సూచిగా కేసీఆర్ పాలన



కరువు, వలసలతో అల్లాడిన తెలంగాణ వ్యవసాయాన్ని 'పండుగ'గా మార్చడం కేసీఆర్ ప్రభుత్వ ఘనవిజయం. పూడికలతో నిండిన చెరువులకు మిషన్ కాకతీయ ద్వారా పునర్జీవం పోసి, గ్రామీణ జలవనరులను పునరుద్ధరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను విస్తృత ప్రాంతాలకు తరలించి, బీడుభూములను సస్యశ్యామలం చేశారు. ఈ చర్యల ఫలితంగా సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. ధాన్యోత్పత్తి కూడా బహుళ రెట్లు అభివృద్ధి చెందింది. రైతుబంధు ద్వారా ఎకరానికి, ఏడాదికి రూ.10 వేల పెట్టుబడి సాయం, రైతు బీమా ద్వారా రూ.5 లక్షల ఆర్థిక భద్రత, 24 గంటల ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైతు వేదికల నిర్మాణం రైతులకు పూర్తి మద్దతునిచ్చాయి.

ప్రజల వద్దకే సంక్షేమ పాలన

పాలన ప్రజల ముంగిట ఉండాలనే సూత్రంతో పరిపాలనా వికేంద్రీకరణ జరిగింది. ప్రాజెక్టులు, భౌగోళిక పరిస్థితులు, ప్రజా సౌకర్యాలను దృష్టిలో ఉంచి 10 జిల్లాలను 33 జిల్లాలుగా పునర్విభజన చేశారు. కొత్తగా రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు, పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేయడం ద్వారా అధికారులు ప్రజలకు దగ్గరయ్యారు. గిరిజన ప్రాంతాల్లోని తండాలు, గూడేలకు ప్రత్యేక గ్రామ పంచాయతీ హోదా ఇవ్వడం ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచింది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు, పల్లె ప్రగతి ద్వారా పరిశుభ్రత, పచ్చదనం, స్మశానవాటికలు, చెత్త నిర్వహణ వంటి సౌకర్యాలు గ్రామీణ జీవన నాణ్యతను మెరుగుపరిచాయి.

**విద్యా, వైద్యరంగంలో విప్లవం**

పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు గురుకుల విద్యా సంస్థలు విస్తరించాయి. 'మన ఊరుమన బడి' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, తాగునీరు, విద్యుత్తు సౌకర్యాలు కల్పించారు. జూనియర్, డిగ్రీ కళాశాలల ఆధునీకరణతో గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చింది. వైద్యారోగ్య రంగంలో జిల్లాకొక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారు. దవాఖానలు, మౌలిక సదుపాయాలు విస్తరించాయి. పడకల సంఖ్య, ఐసీయూలు, డయాలసిస్ కేంద్రాలు, బస్తీ దవాఖానాలు పెరగడంతో పేదలకు స్థానికంగానే నాణ్యమైన చికిత్స అందే విధంగా మారింది. టిమ్స్ నిర్మాణం, నిమ్స్ విస్తరణతో హైదరాబాద్ మెడికల్ హబ్‌గా ప్రసిద్ధి చెందింది.

**విద్యుత్తు, పారిశ్రామిక పురోగతి**

రాష్ట్ర ఏర్పాటు సమయంలో విద్యుత్తు కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ, స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రణాళికలు, పట్టుదలతో ఉత్పత్తి సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి దాదాపు 20 వేల మెగావాట్లకు పెంచారు. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్తు అందించి, పరిశ్రమలకు అవసరమైన నాణ్యమైన కరెంటును సరఫరా చేశారు. టీఎస్-ఐపాస్ విధానం ద్వారా పరిశ్రమల అనుమతులకు పారదర్శక విధానం తీసుకొచ్చారు. నిర్ణీత కాలపరిమితితో అనుమతులు జారీ చేసే పాలసీని అమలు చేశారు. దీంతో కొత్త పెట్టుబడులను ఆకర్షించి, లక్షలాది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు సృష్టించారు.

**సంక్షేమం, ఆర్థిక వృద్ధి**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, దళితబంధు, గొర్రెల పంపిణీ, మత్స్యకార సంక్షేమం వంటి పథకాలు సమాజంలోని అన్ని వర్గాలకు భద్రత కల్పించాయి. ఫలితంగా 2014-15లో రూ.5.06 లక్షల కోట్లుగా ఉన్న జీఎస్డీపీ 2022-23 నాటికి రూ.13.13 లక్షల కోట్లకు పెరిగింది. తలసరి ఆదాయం రూ.3,12,398గా నమోదై, జాతీయ సగటు రూ.1,72,276ను అధిగమించింది. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనా కాలంలో సాధించిన ఈ బహుముఖ ప్రగతి కేవలం మౌలిక సదుపాయాల విస్తరణే కాదు, ప్రజల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు సాక్ష్యం. కేసీఆర్ దార్శనిక నాయకత్వం తెలంగాణను దేశానికే అభివృద్ధి దిక్సూచిగా నిలబెట్టింది.

# బొడ్డెమ్మ పండగ.. పల్లె సంస్కృతికి ప్రతీక



బతుకమ్మ పుట్టుకకు ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. ఇంట్లో అందరికీ ఆడపడుచులతో ఆత్మీయ బంధం ఉ న్నట్టే బతుకమ్మ పండగతో కూడా బంధం తెలంగాణలో ప్రత్యేకం. భాద్రపద మాసంలో వచ్చే పెత్తరమావాస్య ముందు తొమ్మిది రోజుల ముందు నుంచే 'బొడ్డెమ్మ' పండుగతో బతుకమ్మ పండుగ వేడుకలు మొదలవుతాయి. కొన్ని గ్రామాల్లో కొందరు బొడ్డెమ్మతో మొదలుపెట్టి తర్వాత తొమ్మిది రోజులు దేవీనవరాత్రుల్లో బతుకమ్మని, దుర్గాదేవిని కూడా ఆరాధిస్తుంటారు. ఈ పండగలో భక్తి, ఆనందం, ప్రకృతి, ప్రేమ కలగలిసి కనిపిస్తాయి. పొలం పనులు ఇతర కాయకష్టం చేసే మహిళలు పాడే ఆట పాటలతోనే అసలైన బతుకమ్మ అందచందాలు. జీవిత అనుభవాలకు దగ్గరగా ఉండి అందర్నీ చలింపజేస్తాయి. జీవితానుభవాలు, కష్టసుఖాలు, ప్రపంచంలో జరిగిన కొన్ని సంఘటనలు, జానపద కథల్లో చెప్పే కథానాయకులు, నమ్మకాలు, మంత్రతంత్రాలు, అదృశ్యశక్తులు, అభూత కల్పనలు, పురాణాలు, సీతారాముల పచ్చీసు, ఊర్మిళ నిద్ర, సారంగధరుడి చిన్నమ్మ కష్టాలు, పెండ్లి అప్పగింతల పాట ఇలా ఒకటి కాదు, ఎన్నో విషయాలను పాటలుగా మలిచి రోజూ రెండు మూడు గంటలు ఆగకుండా పాడుతారు. ఒక్కోసారి పాటలు కూడా ఒకరోజులో అయిపోయే కథగా కాకుండా రెండుమూడు రోజుల వరకు పొడిగింపుగా పాడేవారు. ఈ పండుగలో వినిపించే జానపద గీతాలు తెలంగాణ పల్లె జీవనానికి అద్దం పడతాయి. ఫొటోలు, వీడియోలు లేని కాలంలో మనసులో పదిలంగా ఉండే బతుకమ్మ ఆరాధన ఇప్పుడు మీడియా పుణ్యమా అని ఎంతోమందికి చేతినిండా పని కల్పించింది. ఏదేమైనా బతుకమ్మను ఒక ఆరాధన పూర్వకంగా పేర్చడం, దేవుడితో సమంగా దేవుడి ఇంట్లో పెట్టి భక్తితో పసుపు గౌరిని చేసి కలిగిన రీతిలో రకరకాల వంటలతో నైవేద్యం పెడతారు. నీళ్లలో నిమజ్జనం చేసేటప్పుడు పసుపు గౌరీదేవిని కుంకుమ, పులుసుచద్దుల ప్రసాదాలు ఒకరికొకరు పంచుకుంటూ ఆప్యాయంగా బతుకమ్మ పండుగ ముగుస్తుంది. ఇక సద్దుల బతుకమ్మ వైభవం ఇంతా అంతా కాదు. ఆ రోజు బతుకమ్మ దగ్గర పలుకరించుకోని పడతులు ఉండరంటే అతిశయోక్తి కాదు. బతుకమ్మ పండుగ ఉయ్యాల పాటలు ఎప్పుడూ అమ్మాయిల జీవితాల ప్రతిబింబాలు. బతుకమ్మ సంబురాలు మాత్రం తెలంగాణ ఆడపడుచులకు ఎన్నో రోజులు మంచి జ్ఞాపకాలు.

# ఎండిపోతున్న ఆశలు.. రైతన్నకు భరోసా ఎక్కడ?



వ్యవసాయం బాగుంటేనే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది బలంగా ఉంటుంది. రైతు సంతోషంగా ఉంటేనే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు చురుగ్గా సాగుతాయి. అలాంటి వ్యవసాయ రంగం నేడు వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు, పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలతో అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఎల్‌నినో ప్రభావంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రకృతి పరిస్థితులను పూర్తిగా నియంత్రించలేకపోయినా, వాటి ప్రభావంతో రైతులు నష్టపోకుండా చూడటం మాత్రం పాలకుల చేతుల్లోనే ఉంది. వర్షాలు తగ్గితే పంటలు దెబ్బతింటాయి. పంటలు దెబ్బతింటే రైతుల ఆదాయం తగ్గుతుంది. ఆదాయం పడిపోతే అప్పుల భారం పెరిగి కుటుంబ జీవనం కష్టమవుతుంది. ఈ ప్రభావం రైతులకే పరిమితం కాకుండా గ్రామీణ వ్యాపారాలు, వ్యవసాయ కూలీలు, మార్కెట్లు, రవాణా రంగాలపైనా పడుతుంది. అందువల్ల కరవు పరిస్థితులను కేవలం వ్యవసాయ సమస్యగా కాకుండా సామాజిక, ఆర్థిక సమస్యగా గుర్తించాలి. తెలంగాణలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగునీరు, తాగునీరు, విద్యుత్తు సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. ఏ ప్రాంతంలో ఎంత నీరు అందుబాటులో ఉంది? ఏ పంటలకు నీటి అవసరం ఎక్కువగా ఉంది? ఎక్కడ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయవచ్చు? వంటి అంశాలపై అధికారులు ముందుగానే అంచనాలు రూపొందించాలి. రైతులకు సకాలంలో సూచనలు అందించి పంట నష్టాన్ని తగ్గించే ప్రయత్నం చేయాలి. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ చివరి ఆయకట్టుకు నీరు చేరకపోతే వాటి ప్రయోజనం నెరవేరదు. చెరువులు, కుంటలు, కాలువల నిర్వహణను మెరుగుపరచాలి. వర్షపు నీటిని నిల్వ చేసుకునే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలి. నీటి కొరత ఏర్పడిన తర్వాత హడావుడిగా చర్యలు చేపట్టడం కంటే ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం సమర్థ పాలనకు నిదర్శనం. మరోవైపు, సాగు ఖర్చులు పెరుగుతున్నప్పటికీ రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందనే భరోసా ఉండటం లేదు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరగడంతో పెట్టుబడి భారం అధికమవుతోంది. పంట నష్టపోతే రైతుకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో పంటల బీమా, నష్టపరిహారం, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థలను మరింత సమర్థంగా అమలు చేయాలి. అర్హులైన రైతులకు సహాయం అందించడంలో జాప్యం జరగకుండా చూడాలి. వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడం కూడా అవసరం. అయితే పంటలు మార్చుకోవాలని రైతులకు సూచించడం మాత్రమే సరిపోదు. ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ సదుపాయాలు, గిట్టుబాటు ధర, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండాలి. వ్యవసాయ నిపుణుల సూచనలు గ్రామస్థాయికి చేరాలి. వాతావరణ అంచనాలను ఆధారంగా చేసుకుని రైతులు నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. ఇలాంటి కీలక సమయంలో రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వం తన చర్యలను ప్రజలకు వివరించాలి. ప్రతిపక్షాలు లోపాలను ఎత్తిచూపడంతో పాటు ఉపయోగకరమైన సూచనలు చేయాలి. రైతులకు నీరు అందడం, పంట నష్టం తగ్గడం, పరిహారం సకాలంలో లభించడం వంటి అంశాలే పాలనకు నిజమైన కొలమానాలు కావాలి. కరవు నివారణకు తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, సమర్థవంతమైన సాగునీటి పంపిణీ, పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ సాంకేతికత వినియోగం వంటి అంశాలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. రైతు ఆదాయాన్ని స్థిరపరిచే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. రైతన్నకు భరోసా ఇవ్వడం అంటే కేవలం ఆర్థిక సాయం ప్రకటించడం కాదు. పంటను కాపాడే నీరు, సాగుకు అవసరమైన వనరులు, పండించిన పంటకు గిట్టుబాటు ధర, కష్టకాలంలో అండగా నిలిచే వ్యవస్థను అందించడం. ప్రకృతి విసిరే సవాళ్లను పూర్తిగా నివారించలేకపోయినా, సమర్థమైన ప్రణాళికతో వాటి ప్రభావాన్ని తగ్గించవచ్చు. రైతు కళ్లలో ఆందోళనకు బదులుగా ఆశ కనిపించినప్పుడే ప్రభుత్వ చర్యలకు సార్థకత చేకూరుతుంది. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే వాస్తవాన్ని పాలకులు గుర్తించి కార్యాచరణకు దిగాలి

# చికిత్స రేట్లను ప్రదర్శించాల్సిందే!

**దవాఖానలు, క్లినిక్‌లకు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశాలు**

**సేవలు, సౌకర్యాల ధరలను ప్రముఖంగా ప్రదర్శించాలి**

**వైద్య బిల్లుల్లో పారదర్శకత పెంచడమే లక్ష్యం**

**నిబంధనల అమలును సమీక్షించాలని అధికారులకు సూచన**

**అధిక దవాఖాన బిల్లులపై పెరుగుతున్న ఆందోళనలు**

**పడకలు, మందులు, వైద్య పరికరాల ధరలపై దృష్టి**

**విదేశీ రోగుల చికిత్స ప్యాకేజీలనూ వెల్లడించాలి**

**క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలుపై కేంద్రం దృష్టి**



న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా దవాఖానల్లో వైద్య చికిత్సల ధరల ప్రదర్శనను తప్పనిసరిగా అమలు చేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశించింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టాన్ని అమలు చేస్తున్న 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. వైద్య సేవలకు అయ్యే ఖర్చులపై రోగులకు స్పష్టత కల్పించడం, బిల్లింగ్ విధానంలో పారదర్శకత పెంచడం ఈ ఆదేశాల ప్రధాన ఉద్దేశం. కేంద్ర ఆరోగ్య కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ ఈ మేరకు సంబంధిత అధికారులకు లేఖ రాశారు. దవాఖానలు, క్లినిక్‌లు అందించే వైద్య సేవలు, సౌకర్యాలకు సంబంధించిన ఛార్జీలను రోగులకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించేలా చూడాలని కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలను ఆరోగ్య సంరక్షణ సంస్థలు పాటిస్తున్నాయో లేదో సమీక్షించాలని, ఉల్లంఘనలు జరిగితే నిబంధనల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ వైద్యరంగంలో అధిక బిల్లులు వసూలు చేయడం, పడకల ఛార్జీలు పెంచడం, మందులు, వైద్య వినియోగ వస్తువులపై అధిక లాభాలు పొందడం వంటి అంశాలపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలు చేపట్టింది. చికిత్స ప్రారంభించే ముందే రోగులు ఖర్చుల వివరాలను తెలుసుకునే అవకాశం ఉండాలని, ధరల విషయంలో స్పష్టత ఉండాలని ఆరోగ్యశాఖ భావిస్తోంది. వైద్య చికిత్సలు, సేవల ధరలతోపాటు మెడికల్ లేదా ఆయుష్ వీసాలపై భారత్‌కు వచ్చే విదేశీ రోగుల కోసం అందించే చికిత్స ప్యాకేజీల ధరలను కూడా దవాఖానలు ప్రదర్శించాలని కేంద్రం సూచించింది. ఈ నిబంధనల అమలుతో వైద్య ఖర్చులపై రోగులకు ముందస్తు అవగాహన పెరగడంతోపాటు, అనవసరమైన బిల్లులపై ఫిర్యాదులు చేసేందుకు కూడా అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు.

# స్థానిక ఎన్నికలే లక్ష్యంగా టీడీపీ నేతల వ్యూహారచన!

**మంత్రి ఫరూక్‌తో గౌరు వెంకట్‌రెడ్డి భేటీ .. పార్టీ బలోపేతం, కూటమి విజయంపై చర్చ**



**నంద్యాల క్రైం । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 12, 2026**
నంద్యాల :రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నేతలు సమాలోచనలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నంద్యాల జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు, నందికొట్కూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గౌరు వెంకట్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా రాజకీయ పరిణామాలు, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అనుసరించాల్సిన కార్యాచరణపై నేతలు చర్చించారు. ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని కూటమి విజయానికి నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడం, నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నరు.

## నూతన వధూవరులను ఆశీర్వదించి ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత రెడ్డి.



**శిరివెళ్ళ.(డ్రీమ్ టైమ్స్)**
శిరివెళ్ళ మండల కేంద్రంలోని భూమా కుటుంబ అభిమాని వసీం, వలిమ ఫంక్షన్ కు నంద్యాల పట్టణంలోని రాజారెడ్డి ఫంక్షన్ హాల్ లో హాజరై నూతన వధూవరు లను ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యనిర్వహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శిరివెళ్ల మండల టిడిపి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి వధూవరులను ఆశీర్వదించారు. ఏర్పాటు చేసిన విందు భోజనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించండి.

**-రద్దు చేసిన 26 దళిత సంక్షేమ పథకాలను పునఃప్రారంభించాలి.**
**-ఎన్ఎఫ్ఎస్డిసీ పథకం కొనసాగించాలే చర్యలు తీసుకొండి.**
**-రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కి వినతి పత్రం అందించిన మాల సంఘాల జేపీసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి**

**ఒంగోలు. ( డ్రీమ్ టైమ్స్)**



కేంద్ర, రాష్ట్రల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ రాష్టానికి ఎస్సి కార్పొరేషన్ నిధులను తక్షణమే విడుదల చేయాలని మాల మహానాడు జేపీసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు బాల వీరాంజనేయులు ను ఒంగోలు పట్టణంలో తన స్వగృహులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దస్తగిరి ఒంగోలు నుంచి నంద్యాల జిల్లా మీడియా ప్రతినిధులతో ఫోన్లో మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన 26 దళిత పథకాలను ప్రవేశపెట్టాలని కోరామన్నారు. మరి ముఖ్యంగా బ్యాంకు లింకేజీ భూమి కొనుగోలు పథకం ఎన్ఎస్ఎఫ్ డిసి పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేశవుడు, మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు స్వామి దాసు తదితరులు పాల్గొన్నారు.

# 120 ఫిర్యాదులు.. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం!

**ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు.. అధికారులకు ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాలు**

**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్**
**12 అక్టోబర్ 2026**



నంద్యాల :నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీఎస్, ప్రజల నుంచి 120 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరిధిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ బాధితులకు భరోసా ఇచ్చారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖను ఆశ్రయించినప్పుడు వాటిని బాధ్యతాయుతంగా పరిగణించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం వహించరాదని, నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు వచ్చే పరిస్థితి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పరిష్కరించిన ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి అందజేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు చట్టపరిధిలో న్యాయం అందించడమే లక్ష్యంగా పోలీస్ అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు.

# మోటార్ సైకిళ్ల దొంగల ముఠా గుట్టురట్టు!

**-ఆరుగురిని పట్టుకున్న గోస్పాడు పోలీసులు..**
**రూ.6 లక్షల విలువైన 10 బైక్‌లు స్వాధీనం**



**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 12,2026**
నంద్యాల జిల్లా : నంద్యాల జిల్లాలో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను గోస్పాడు పోలీసులు ఛేదించారు. ఖచ్చితమైన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు, ఒక బాల నేరస్తుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ. 6 లక్షల విలువైన 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గోస్పాడు పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 75/2026 కేసు దర్యాప్తులో భాగంగా గోస్పాడు ఎస్ఐ పి. సుధాకర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి సోమవారం (12-10-2026) ఉదయం తెల్లపూరి గ్రామ శివారులోని కుందూ నది బ్రిడ్జి సమీపంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ కంపచెట్లలో దాచిన మోటార్ సైకిళ్లను బయటకు తీస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన ఆరుగురిని పోలీసులు చుట్టుముట్టి పట్టుకున్నారు. విచారణలో నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లను దొంగిలించినట్లు వారు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

**మారుతాళాలతో బైక్‌ల చోరీ**
సులభంగా డబ్బు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశంతో నిందితులు ముఠాగా ఏర్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. రాత్రి వేళల్లో ఇళ్ల ముందు, షెడ్లలో నిలిపి ఉంచిన మోటార్ సైకిళ్లకు మారుతాళాలతో లాక్‌లు తెరిచి వాహనాలను దొంగిలించేవారని పోలీసులు తెలిపారు. అనంతరం నంబర్ ప్లేట్లను తొలగించి, ఎవరికీ అనుమానం రాకుండా తెల్లపూరి గ్రామం సమీపంలోని కుందూ నది బ్రిడ్జి వద్ద కంపచెట్లలో దాచేవారు. ఆ వాహనాలను నంద్యాలలో గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుబడ్డారని పేర్కొన్నారు.

**ఐదుగురు అరెస్ట్.. బాల నేరస్తుడు అదుపులోకి**
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అరెస్టయిన నిందితులు:
1. దొడ్డగాళ్ల ప్రకాష్ (21) -- చిన్న మల్కాపురం గ్రామం, డోన్ మండలం; ప్రస్తుతం యాళ్లూరు గ్రామం.
2. పాల్తి గోపి నాయక్ (19) -- రైల్వే స్టేషన్ సమీపం, నంద్యాల.
3. షేక్ షబ్బీర్ హుస్సైన్ (18) -- దేవనగర్, నంద్యాల.
4. సలవాది మధు (20) -- యాళ్లూరు గ్రామం, గోస్పాడు మండలం.
5. చాకలి తేజ (19) -- ఎర్రగుంట్ల గ్రామం, శిరివెళ్ల మండలం.

వీరితో పాటు 17 ఏళ్ల బాల నేరస్తుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. చట్టప్రకారం బాల నేరస్తుడి వివరాలను గోప్యంగా ఉంచారు. ౹ా1 నుంచి ౹ా3 వరకు ఉన్న నిందితులపై గతంలో మహానంది, ఆళ్లగడ్డ టౌన్, నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

**పోలీసు సిబ్బందికి అభినందనలు**
ఈ కేసులో మొత్తం 10 మోటార్ సైకిళ్లను పంచాయతీదారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను 12-10-2026 ఉదయం 10.45 గంటలకు అరెస్టు చేసి, అరెస్టు కారణాలను చట్టప్రకారం తెలియజేశారు. నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచే చర్యలు చేపట్టగా, కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసును ఛేదించడంలో చురుకుగా పనిచేసిన గోస్పాడు ఎస్ఐ పి. సుధాకర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ 2813, కానిస్టేబుళ్లు 1337, 3224, 3256, హోంగార్డు 310లను ఉన్నతాధికారులు అభినందించారు.

**వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి**
వాహనదారులు తమ మోటార్ సైకిళ్లకు హ్యాండిల్ లాక్‌తో పాటు అదనపు లాక్‌ను ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వేళల్లో సురక్షిత ప్రదేశాల్లో వాహనాలను నిలిపి ఉంచాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, తక్కువ ధరకు నంబర్ ప్లేట్ లేని వాహనాలను విక్రయించేందుకు ఎవరైనా ప్రయత్నించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు.

# 'గ్రూప్-2" మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**-ఈ నెలాఖరు వరకు దరఖాస్తుకు గడువు**
**-మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**అమరావతి, డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 12, 2026**
రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్న గ్రూప్-2 ఉద్యోగాల కోసం పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ నెలాఖరు 31వ తేదీ లోగా అర్హత కలిగిన వారందరూ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని అమరావతి లో సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి కోరారు.మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్(సిఈడియం) నేతృత్వంలో అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు ఏపీపీఎస్సీ గ్రూప్-2 నియామక పరీక్షల కోసం ఆన్ లైన్/ఆఫ్ లైన్ లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు.ఇందులో భాగంగా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.బిపిఎల్ కార్డు కలిగి ఉండటం ఆఫ్‌లైన్ కోచింగ్‌కు తప్పనిసరి అర్హతగా పరిగణించబడుతుందని వెల్లడించారు.దరఖాస్తు సమయంలో సంబంధిత బిపిఎల్ కార్డు( తెల్ల రేషన్ కార్డు)/ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. గ్రూప్ -2 ఉద్యోగాల సాధన కోసం పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ తో పాటు విద్యాపరమైన మద్దతును అందించడమే ఉచిత శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఉచిత శిక్షణలో రాత పరీక్ష సన్నద్ధత, జనరల్ స్టడీస్, రీజనింగ్, కరెంట్ అఫైర్స్ తో పాటు నియామక పరీక్షకు నిర్దేశించిన ఇతర సంబంధిత అంశాలపై పూర్తి దృష్టి సారిస్తారని తెలిపారు.మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు, నిర్దేశించిన అర్హతా షరతులకు లోబడి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. అర్హత,ఆసక్తిగల రాష్ట్రవ్యాప్త మైనారిటీ అభ్యర్థులందరూ తమ వివరాలను"సిఈడియం-ఏపీ" అధికారక వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ పద్ధతిలో నమోదు చేసుకోవాలని కోరారు.
వెబ్ సైట్ : ఋఋఋ.ఖజూఎవసఎఎఎ.శీతీస్త లేదా సెల్ నెంబర్లు: 08645-297535, 7386789966 లను సంప్రదించాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

# పశుల పేటలో సిసి రోడ్డు నిర్మించండి

**- నీటి సరఫరాను పునరుద్ధరించండ.**



**శిరివెళ్ళ.(డ్రీమ్ టైమ్స్)**
మండల కేంద్రంలోని పసుల పేటలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పసుల రామకృష్ణ యాదవ్ మరియు కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఎంపీడీఓ సి శివ మల్లేశ్వరప్పకు వినతి పత్రం అందజేశారు. శిరివెళ్ల నడి ఊరిలో పసుల పేట ఉన్నదని సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన సిసి రోడ్డు శిథిలమై గుంతల మయంగా మారిందన్నారు. గతంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టి సి సి రోడ్డు వేయకపోవడం వల్ల డ్రైనేజీ ఎత్తుగా రహదారి తక్కువగా మారిందని కాలనీ ప్రజలు అర్జిలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ తాగునీటి సరఫరా సైతం తమ కాలనీలో లేదని పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కు ఫిర్యాదు చేశారు.పల్లె పండుగ కింద విడుదలైన నిధుల ద్వారా పసుల పేటలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టి మౌలిక వసతుల కల్పన కు కృషి చేయాలని కాలనీ ప్రజలు పేర్కొన్నారు.

# శ్రీశైలంలో దసరా మహోత్సవాలు..

**-నిత్య కళారాధన వేదికపై సంగీతం, పౌరాణిక నాటకం**



**శ్రీశైలం, అక్టోబర్ 12 (డ్రీమ్ టైమ్స్)**
శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదికపై పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు జానపద కళారూపాలతో భక్తులను అలరించారు.
నిత్య కళారాధన వేదికపై సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు సికింద్రాబాద్‌కు చెందిన డాక్టర్ విశాలాక్షి, వారి బృందం గాత్ర సంగీత కార్యక్రమాన్ని ప్రదర్శించారు. అనంతరం రాత్రి 7.30 గంటల నుంచి నెల్లూరుకు చెందిన కె. సుధాకరరావు, వారి బృందం 'గయోపాఖ్యానం' పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.
గ్రామోత్సవంలో జానపద కళారూపాలు శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవంలో భాగంగా నాదస్వరం, కేరళ చండీ మేళం, కొమ్ము, కోయ నృత్యం, థయ్యం, విళక్కు, స్వాగత నృత్యం, కోలాటం, రాజభటుల వేషాలు, జానపద పగటి వేషాలు, అశ్వ ప్రదర్శన, డమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, త్రిశూలం, జేగంట, కంచుడోలు, చెక్కభజన, అమ్మవారి వేషం, తప్పెట చిందు, డోలు విన్యాసం, వీరభద్ర డోలుకుణిత తదితర సంప్రదాయ కళారూపాలు భక్తులను విశేషంగా అలరించాయి. కన్నడ జానపద కళా కార్యక్రమాలు సైతం గ్రామోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దసరా మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు భారతీయ సంప్రదాయ కళలు, సంస్కృతిని చాటిచెప్పాయి.

# ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం సమస్యల వలయం

**- భూభారతి చట్టం ద్వారా సామాన్యునికి లభించని న్యాయం**

**-భూ భారతి నమోదులో అక్రమాలు జరగాయంటూ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన రాజగోపాల్**



మంథని, అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్
భూ భారతి పోర్టల్‌లో భూముల నమోదు వ్యవహారంపై అక్రమాలు జరిగాయంటూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షకు ఫిర్యాదు చేసినట్లు మంథని రాజగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిషేధిత భూమికి రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని, మరోవైపు సక్రమమైన భూముల సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదని ఆయన ప్రశ్నించారు. భూముల రికార్డులు, మార్కెట్ విలువల నిర్ధారణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మంథని గ్రామంలోని సర్వే నంబర్ 94/బి హెచ్ నంబర్ 2-5 ఏ కు సంబంధించిన భూముల వ్యవహారంలో 1992 నాటి కట్టడాలు, ఇంటి రికార్డులు, 788/1982 డాక్యుమెంట్ వివరాలను ప్రస్తావిస్తూ ఫిర్యాదుదారు పలు సందేహాలు లేవనెత్తారు. సర్వే నంబర్ 94డిలోని భూమి నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. సుమారు 40 సెంట్ల భూమికి సంబంధించిన రికార్డులు, నిషేధిత జాబితా వివరాలను పరిశీలించి వాస్తవాలు వెల్లడించాలని కోరారు. సంబంధిత భూమి మార్కెట్ విలువ సుమారు రూ.82 లక్షలు ఉండగా, ఖాతా నంబర్ 61183, 0.0526 గుంటల విస్తీర్ణానికి రూ.5.60 లక్షలుగా విలువ చూపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.5,62,500 విలువ ఆధారంగా స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగినట్లు రాజగోపాల్ ఆరోపించారు. భూమి వాస్తవ మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకున్నారా? ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి నష్టం జరిగిందా అనే అంశాలపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియలో నిబంధనలు పాటించారా? సంబంధిత అధికారుల అనుమతులు ఉన్నాయా అనే అంశాలపై కూడా అనుమానాలు ఉన్నాయన్నారు. కలెక్టర్ లాగిన్ ద్వారా వివరాల్లో మార్పులు జరిగాయన్న ఆరోపణలపై సాంకేతిక రికార్డులను పరిశీలించి నిజానిజాలు తేల్చాలని కోరారు. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ వెలువడాల్సి ఉందన్నారు. మంథని పరిధిలోని సర్వే నంబర్ 1112/ఏ, బి, సి, డి లోని రెండు ఎకరాల భూమికి సంబంధించి డాక్యుమెంట్ నంబర్ 2209/2011, పట్టా వివరాలు, ఎస్ఎల్ఎన్ఎస్/2020/1 దరఖాస్తు తేదీ 26-08-2020ను ఫిర్యాదులో ప్రస్తావించనన్నారు. సంబంధిత భూమి రికార్డులు, దరఖాస్తు స్థితి, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు. భూభారతి పోర్టల్‌లో భూముల రికార్డుల నిర్వహణ, నిషేధిత జాబితా మార్పులు, మార్కెట్ విలువల నిర్ధారణపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని రాజగోపాల్ కోరారు. అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయడంతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు..

# మంచిర్యాల జిల్లా ఎమ్మార్పీఎస్ నూతన పట్టణ కమిటీ

**, మంచిర్యాల, అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
మంచిర్యాల జిల్లా కేంద్రం లో స్నేహ ఫంక్షన్ హాల్ లొ పద్మశ్రీ ..మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు... మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మంచిర్యాల పట్టణ ఇంచార్జి గుడిసెల దశరథం మాదిగ, కో-ఇంచార్జీ గడ్డం సత్యం మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన పట్టణ కమిటీ ఏర్పాటు, ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా ఇంచార్జీ లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ హాజరై మాట్లాడుతూ...పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గత 32 సంవత్సరాలుగా అణగారిన వర్గాల కోసం అనేక పోరాటాలు చేసిన మహా నాయకుడు. ఆరోగ్యశ్రీ పథకం, వృద్ధులకు-వితంతువులకు పెన్షన్ సాధన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలపై అత్యాచారాలు జరిగితే ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయించిన ఘనత మందకృష్ణ మాదిగ ది. భారతదేశంలో సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తి మందకృష్ణ మాదిగ. ఆయన నాయకత్వంలో భవిష్యత్తు ఉద్యమాలకు యువత ముందుకు రావాలి. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాజ్యాధికారం సాధించుకోవాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుందిళ్ల రమేష్, రాష్ట్ర సెక్రటరీ రామ్ అశోక్ మాదిగ, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మంతెన మల్లేష్ మాదిగ, జూపాక సాయిలు మాదిగ, గద్దల బానయ్య మాదిగ, చుంచు శంకర్ వర్మ మాదిగ, చెన్నూరు శ్రీనివాస్ మాదిగ, మంత్రి మల్లేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ మాదిగ, రాసాపాక మల్లేష్ మాదిగ, ఎం ఈ ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రాసపల్లి రవి మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు జలంపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మంచిర్యాల నియోజకవర్గ ఇంచార్జీ చిప్పకుర్తి మల్లేష్ మాదిగ, సీనియర్ నాయకులు సకినారపు మల్లేష్, వేముల రమేష్, మల్లారపు చిన్నరాజం... ఎం ఆర్ పి స్ మాజీ జిల్లా అధ్యక్షులు ఉ సర్పంచుల పోరం జిల్లా అధ్యక్షులు చెన్నూరు సమ్మయ్య మాదిగ, పెగడపల్లి సర్పంచ్ రామగిరి రాము మాదిగ తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు. సామాజిక ఉద్యమ నమస్కారాలతో లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా ఇన్చార్జి



# విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి



**మంథని, అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
మంథని మండలంలోని రచ్చపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. రహదారి పక్కన ఉన్న చెట్ల కొమ్మలు కొడుతుండగా విద్యుత్ షాక్ తగిలి కాయతి లచ్చయ్య కుమారుడు కాయతి లింగయ్య 85 మృతి చెందాడు. మంథని ఎస్ఐ సందీప్ కుమార్ అందించిన సమాచారం మేరకు రచ్చపల్లి గ్రామానికి చెందిన కాయతి లింగయ్య కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం సుమారు 8:00 గంటల సమయంలో గ్రామ పంచాయతీ సిబ్బంది వాంకుడోత్ శివయ్య రహదారి పక్కన ఉన్న చెట్ల కొమ్మలు కొట్టాలని లింగయ్యకు సూచించినట్లు మృతుడి కుమారుడు కాగిత శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో లింగయ్య చెట్టు ఎక్కి కొమ్మలు కొడుతుండగా, అక్కడ ఉన్న విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే మృతున్ని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చెట్టు సమీపంలో విద్యుత్ తీగలు ఉన్నప్పటికీ తగిన హెచ్చరికలు ఇవ్వకుండా, భద్రతా చర్యలు తీసుకోకుండా వృద్ధుడితో చెట్ల కొమ్మలు కొట్టించారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా వాంకుడోత్ శివయ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. వృద్ధుడి మృతికి దారితీసిన పరిస్థితులు, బాధ్యతారాహిత్యం ఏమైనా ఉందా అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు..

# మంథని గోదావరిలో అక్రమ మట్టి పనులు నిలిపివేయాలి

**-పుష్కర ఘాట్ నిర్మాణ పనులపై బిజెపి నాయకుడు తిరుపతి మంథని ఎఫ్ ఆర్ ఓకు ఫిర్యాదు**




**మంథని, అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
మంథని పట్టణంలోని గోదావరి నదిలో యంత్రాలతో చేపడుతున్న మట్టి పనులను తక్షణమే నిలిపివేయాలని భారతీయ జనతా పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి డిమాండ్ చేశారు. గోదావరి నది తీరంలో పుష్కర ఘాట్ నిర్మాణ పనుల పేరుతో నదిలో నిల్వ ఉన్న నీటిని మట్టితో పూడుస్తూ, సహజ వనరులైన ఇసుక, బండరాళ్లను ధ్వంసం చేస్తున్నారని ఆయన మంత్రి ఎఫ్ ఆర్ ఓకు సోమవారం ఫిర్యాదు చేశారు. గోదావరి నదిలో భారీ యంత్రాలతో పనులు చేపట్టడం వల్ల నదీ సహజ స్వరూపం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, వన్య ప్రాణుల సంరక్షణ కొరకు తిరుపతి ఆందోళన వ్యక్తం చేశారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 నిబంధనలను ఉల్లంఘిస్తూ పనులు చేపడుతున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంథని అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేసి, గోదావరి నదిలో జరుగుతున్న పనులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు బూడిద తిరుపతి తెలిపారు. అక్రమ పనులను వెంటనే నిలిపివేయకపోతే జాతీయ హరిత ట్రైబ్యునల్, కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ పర్యావరణ, అటవీ శాఖలకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. గోదావరి నది సహజ వనరులను కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు..

# నల్లపోచమ్మ సన్నిధిలో తుల్జా భవాని

**-ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం**







**హైదరాబాద్, అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
జియాగూడ ఇందిరానగర్‌లోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ ముత్యాలమ్మ దేవాలయంలో ఆది జాంబవ సంక్షేమ సంఘం, దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రామ్మోహన్ గురుస్వామి ప్రత్యేకంగా తయారు చేయించిన తుల్జాపూర్ పుణ్యక్షేత్రాన్ని పోలిన తుల్జా భవాని అమ్మవారి విగ్రహాన్ని భారీ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎం. సాయికుమార్(విక్కీ), ప్రధాన కార్యదర్శి తేజేందర్, కోశాధికారి టైసన్ రాజు, సాంస్కృతిక కార్యదర్శులు రాము, ఎం.నవీన్ కుమార్ తదితరుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 13వ తేదీ సాయంత్రం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఎం. సాయికుమార్(విక్కీ) తెలిపారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎం.కిషోర్, దినేష్, ఉదయ్, సంతోష్, దేవాలయ కమిటీ ప్రతినిధులు జి.చెన్నయ్య, పాలెం వెంకటేష్, ఎం.వెంకటేష్, జి.నర్సింగ్ రావు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# తోటి విలేకరికి అండగా ప్రెస్ క్లబ్ సభ్యులు

**-అనారోగ్యం తో ఉన్న విలే కరి కి ఆర్థిక సహాయం**




**మెట్ పల్లి అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
అనారోగ్యంతో బాధపడు తూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోటి విలేఖరి కి మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు అండగ నిలిచారు. ఆ విలేఖరికి త మ వంతుగా ఆర్థిక సహా యం అందజేశారు. మెట్ ప ల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు జంగం విజ య్ అనారోగ్యం తో నిజామాబాద్ లోని ప్రైవేట్ ఆ సుపత్రిలో చికిత్స పొందు తుండగా ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం ఆసుపత్రికి వెళ్లి విజయ్ ఆరోగ్య పరిస్థితి పై వైద్యులతో మాట్లాడి తెలు సుకొని ఆయన కుటుంబ స భ్యులకు 20 వేల ఆర్థిక స హాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అ ధ్యక్షుడు భూరం సంజీవ్, జ నరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, గౌరవ సలహాదారు దాసం కిషన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ అఫ్రోజ్, మాజీ అ ధ్యక్షుడు ఆగ సురేష్ లు పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్ హరిహర వైన్స్ నుంచి వేలాల బెల్ట్ షాపులకు ఆటోల ద్వారా మద్యం సరఫరా

**జైపూర్, ఇందారం వైన్ షాపులు ఉండగా శ్రీరాంపూర్ హరిహర వైన్స్ నుంచి వేలాలకు ఆటోల ద్వారా తరలిస్తున మద్యం పై ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టాలని స్థానికు డిమాండ్**









**జైపూర్, అక్టోబర్ 12 డ్రీమ్స్ టైమ్స్**
మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం లోనీ 20 గ్రామాలకు శ్రీరాంపూర్ పట్టణంలోని హరిహర వైన్స్ నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు మరియు గ్రామంలోని బెల్ట్ షాపులకు మద్యం అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. మద్యం పెట్టెలతో వాహనంలో తరలిస్తున్న దృశ్యాలు అనుమానాలకు తావిస్తున్నాయి.
బెల్ట్ షాపులకు మద్యం సరఫరా వెనుక అసలు కథేమిటి? ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం సరఫరా జరుగుతోందా? టూ 01ఖూ 5434 ఆటో ద్వారా తరలిస్తున్న మద్యం ఎక్కడికి తీసుకెళ్తున్నారు? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మద్యం తరలింపు వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# బిజినెస్

## భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు..

**-22,400 దిగువకు నిఫ్టీ..!**



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐటీ షేర్ల లో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగింది. భారీ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల షేర్లలో బలహీనత కనిపించడంతో మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 547.65 పాయింట్లు నష్టపోయి 71,924.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157.10 పాయింట్లు తగ్గి 22,363.35 వద్ద ముగిసింది. ప్రారంభంలో సానుకూలంగా కదిలిన నిఫ్టీ 22,600 స్థాయిని నిలబెట్టుకోలేకపోవడంతో అమ్మకాల ఒత్తిడికి లోనైందని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. నిఫ్టీకి తక్షణ మద్దతు 22,300-22,200 స్థాయిల మధ్య ఉందని నిపుణులు తెలిపారు. ఈ స్థాయి కిందకు దాటితే 22 వేల వరకు పడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు మార్కెట్‌లో కోలుకోవడం కొనసాగాలంటే నిఫ్టీ తిరిగి 22,500-22,600 స్థాయిని అధిగమించాల్సి ఉంటుందని అంచనా వేశారు. నిఫ్టీలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్, ఐటీసీ, టెక్ మహీంద్రా షేర్లు అత్యధికంగా నష్టపోయిన వాటిలో నిలిచాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల సూచీలు ఎక్కువగా పడిపోయాయి. అయితే మీడియా, కెమికల్స్ రంగాల షేర్లు లాభాలతో ముగిశాయి. ప్రధాన సూచీలు నష్టాల్లో ఉన్నప్పటికీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కొంత మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.08 శాతం పెరుగగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 1.42 శాతం లాభపడింది. రెండో త్రైమాసిక ఫలితాలపై ఆశలు మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లకు మద్దతిచ్చాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

## పెరగనున్న సిమెంట్ ధరలు!

**-ఒక్కో బస్తాపై రూ.10--15 వరకు పెరిగే అవకాశం**

**-పెరిగిన ముడిసరుకు ధరలు, ఉత్పత్తి ఖర్చులు**

**-ఈ వారంలో ధరల పెంపునకు కంపెనీల యోచన**

**-పండుగల సీజన్‌లో డిమాండ్‌పై ఆశలు**

**-ఆదాయాలపై ప్రభావం తగ్గించుకునేందుకు నిర్ణయం**

హైదరాబాద్:
సిమెంట్ ధరలు మరోసారి పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉత్పత్తి వ్యయాలు, ముడిసరుకు ధరలు పెరగడంతో సిమెంట్ కంపెనీలు ఈ వారంలో ధరలను పెంచాలని యోచిస్తున్నట్లు ఎంకే రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఒక్కో సిమెంట్ బస్తాపై రూ.10 నుంచి రూ.15 వరకు పెంపు ఉండొచ్చని అంచనా వేసింది. గత ఆరు నుంచి ఏడు నెలలుగా ముడిసరుకు ధరలు పెరగడం సిమెంట్ పరిశ్రమపై భారంగా మారింది. దీంతో ఉత్పత్తి ఖర్చులు పెరిగి కంపెనీల ఆదాయాలపై



ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో పెరిగిన వ్యయాలను భర్తీ చేసుకునేందుకు ధరల పెంపునకు కంపెనీలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పండుగల సీజన్ ప్రారంభం కావడంతో నిర్మాణ రంగంలో సిమెంట్‌కు డిమాండ్ పెరుగుతుందని కంపెనీలు ఆశిస్తున్నాయి. డిమాండ్, సరఫరా పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో ధరల పెంపునకు ఇదే సరైన సమయమని భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. అయితే, ధరల పెంపు అమలైతే నిర్మాణ పనుల ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇది ప్రతిపాదిత ధరల పెంపు మాత్రమే; కంపెనీల అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## తగ్గిన బంగారం ధరలు!

**-22 క్యారెట్ల 10 గ్రాములపై రూ.400 తగ్గుదల**

**-24 క్యారెట్ల పసిడిపై రూ.440 కోత**

**-రూ.1,38,400కు చేరిన 22 క్యారెట్ల బంగారం**

**-రూ.1,50,980గా 24 క్యారెట్ల పసిడి ధర**

**-స్థిరంగా వెండి ధర.. కిలో రూ.2.45 లక్షలు**

హైదరాబాద్:
బంగారం కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. సోమవారం బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలు తగ్గాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.400 తగ్గడంతో రూ.1,38,400కు చేరింది. అదేవిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.440 తగ్గి రూ.1,50,980గా నమోదైంది. మరోవైపు వెండి ధరలో ఎలాంటి మార్పు లేదు. కిలో వెండి ధర రూ.2,45,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. బంగారం ధరలు తగ్గడంతో ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఉపశమనం లభించనుంది. అయితే, ధరల్లో రోజువారీ మార్పులు ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలు



చేసే ముందు తాజా ధరలను పరిశీలించడం మంచిది.

**తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు కొనసాగనున్నాయి. అయితే, ఆభరణాల దుకాణాలను బట్టి తయారీ ఛార్జీల్లో వ్యత్యాసాలు ఉండవచ్చు. బంగారం కొనుగోలు చేసేటప్పుడు వర్తించే పన్నులు, తయారీ ఛార్జీలను కలిపి తుది ధరను తెలుసుకోవాలి. ప్రస్తుత ధరల ప్రకారం 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.1,38,400, 24 క్యారెట్ల బంగారం రూ.1,50,980గా ఉండగా, కిలో వెండి ధర రూ.2,45,000గా ఉంది.

## ముంబై ఇండియన్స్ ట్రేడింగ్ డీల్..

**మహిళా పేసర్‌కు రూ.10 లక్షలు..!**

: మహిళల ప్రీమియర్ లీగ్ ఐదో సీజన్ వేలానికి ముందే ముంబై ఇండియన్స్ ప్లేయర్ ట్రేడింగ్‌తో వార్తల్లో నిలిచింది. అలాఅనీ హార్దిక్ పాండ్యా ను వదులుకోలేదు. టీ20ల్లో నిలకడగా రాణిస్తున్న మహిళా పేసర్ తారా నోరిస్ ను ముంబై మహిళల జట్టు భారీ ధరకు కొన్నది. అసోసియేటెడ్ దేశాల ప్లేయర్ అయిన నోరిన్‌ను యూపీ వారియర్స్ నుంచి ముంబై కొనుక్కుంది. ఏకంగా రూ.10 లక్షలు ఇచ్చి ఈ ఎడమ చేతివాటం పేసర్‌ను తీసుకుంది ముంబై. నిరుడు వేలంలో నోరిస్‌ను యూపీ ఇంతే ధరకు కొన్న విషయం తెలిసిందే.ఐదో సీజన్ మహిళల ప్రీమియర్ లీగ్ వేలం సమీపిస్తున్న వేళ ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 28న కొచ్చిలో వేలం జరగనుండగా.. అంతకు ముందే అనుభవజ్ఞురాలైె పేసర్‌ను ట్రేడింగ్ పద్ధతిలో తమ కుటుంబంలోకి ఆహ్వానించింది ముంబై. ఫ్రాంచైజీ క్రికెట్‌లో, డబ్ల్యూపీఎల్‌లో నిలకడగా రాణిస్తున్న తారా నోరిస్‌ను భారీ ధరకు దక్కించుకుందీ మాజీ ఛాంపియన్. గత ఎడిషన్‌లో యూపీ వారియర్స్‌కు ఆడిన ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌ను రూ.10లకు కొనేసింది ముంబై. నాలుగో సీజన్ వేలంలో నోరాను యూపీ ఇంతే మొత్తానికి కొన్నది. దాంతో.. అంతే ధరకు ఇప్పుడు ఆమెను




ముంబైకి అప్పగించింది యూపీ. తను ముంబైకి ఆడడం ఇదే మొదటిసారి కాదు. ఇదివరకు ది హండ్రెడ్ లీగ్‌లో ఎంఐ లండన్ జెర్సీతో నోరిస్ మైదానంలో మెరిసింది.

**ఢిల్లీ వదిలేయడంతో**

డబ్ల్యూపీఎల్‌లో తొలుత ఢిల్లీ క్యాపిటల్స్‌కు 2023 సీజన్‌లో ఆడిన తారా నోరిస్ ఆకట్టుకుంది. ఐదు మ్యాచులాడిన తను 4.33 సగటుతో తను 7 వికెట్లు తీసింది. ఆ తర్వాతి ఎడిషన్ వేలంలో నోరిస్‌ను యూపీ వారియర్స్ కొన్నది. అయితే.. మహిళల టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫయర్ కోసం అమెరికా స్క్వాడ్‌కు ఎంపికవడంతో తను ఆ సీజన్ ఆడలేదు. 2026 సీజన్ వేలంలో యూపీ ఆమెకు రూ.10 లక్షలు చెల్లించింది. సెప్టెంబర్ 28న తుది గడువున నోరిస్‌ను అట్టిపెట్టుకుంది యూపీ. ఆ తర్వాత ముంబై ట్రేడింగ్ ప్రతిపాదన తీసుకురాగా తనను అంతే ధరకు అప్పగించేందుకు యూపీ అంగీకరించింది. దాంతో, వేలానికి ముందు ముంబై జట్టు విదేశీ ప్లేయర్ల కోటా నిండింది. ప్రస్తుతం ఎంఐ ఖాతాలో రూ.90 లక్షలున్నాయి.

## పాకిస్థాన్‌పై నిప్పులు.. మూడేళ్లకు మళ్లీ సెంట్రల్ కాంట్రాక్ట్..!

: స్వదేశంలో ఇటీవల పాకిస్థాన్‌పై నిప్పులు చెరిగిన ఓలీ రాబిన్సన్ కు ఇంగ్లండ్ సెంట్రల్ కాంట్రాక్టు దక్కింది. పునరాగమనంలో వికెట్ల వేటతో రెచ్చిపోతున్న ఈ పొడగరి పేసర్ వార్షిక కాంట్రాక్ట్‌కు ఎంపికయ్యాడు. 2026-27 సంవత్సరానికిగానూ సోమవారం ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు 30 మందికి జాతీయ కాంట్రాక్టులు ప్రకటించింది. వీరిలో ఏడుగురికి తొలిసారి ఈ హోదా సొంతమైంది. అలానే దేశవాళీ క్రికెట్‌లో మెరుస్తున్న తొమ్మిది మంది కుర్రాళ్లకు డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్ అప్పగించింది.ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు వార్షిక కాంట్రాక్టులను ప్రకటించింది. అంతర్జాతీయంగా నిలకడగా రాణిస్తున్న స్టార్ ఆటగాళ్లందరికీ కాంట్రాక్ట్ కొనసాగించింది. 2026-27 సంవత్సరానికిగా సోమవారం కెప్టెన్లు జో రూట్, హ్యారీ బ్రూక్‌లతో పాటు 30 మందికి వార్షిక వేతనాలను ఖరారు చేసింది. సొంతగడ్డపై పాకిస్థాన్‌తో సిరీస్‌లో పునరాగమనం చేసి 21 వికెట్లతో చెలరేగిన పొడగరి పేసర్ రాబిన్సన్




మూడేళ్ల తర్వాత కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. ఈమధ్య ఆకట్టుకున్న సామ్ కుక్, టామ్ బాంటన్, జోర్డన్ కాక్స్, హెన్రీ క్రొకొంబే, ఎమిలియో గే, మాథ్యూ ఫిషెర్, డాన్ లారెన్స్‌లకు తొలిసారి సెంట్రల్ కాంట్రాక్ట్ అప్పగించింది ఈసీబీ. టీ20ల్లో బంతితో అదరగొడుతున్న సోనీ బేకర్, కాక్స్, క్రొకొంబెలతో ఇంగ్లండ్ బోర్డు రెండేళ్ల ఒప్పందం చేసుకుంది. మొత్తంగా 11 మంది ఆటగాళ్లకు 2028 సెప్టెంబర్ 30వ తేదీ వరకు కాంట్రాక్ట్ కొనసాగనుందని ఈసీబీ వెల్లడించింది.

ఇంగ్లండ్ సెంట్రల్ క్రాంట్రాక్టు జాబితా 2026-27 : జో రూట్, హ్యారీ బ్రూక్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, సోనీ బేకర్, టామ్ బాంటన్, షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, బట్లర్, కార్సే, సామ్ కుక్, జోర్డన్ కాక్స్, హెన్రీ క్రొకంబే, సామ్ కరన్, లియాం డాసన్, బెన్ డకెట్, ఎమిలియో గే, మాథ్యూ ఫిషర్, విల్ జాక్స్, డాన్ లారెన్స్, సకీబ్ మహమూద్, జేమీ ఓవర్టన్, ఓలీ పోప్, మాథ్యూ పాట్స్, ఆదిల్ రషీద్, ఓలీ రాబిన్సన్, ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జోష్ టంగ్.

ఇంగ్లండ్ డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్ జాబితా 2026-27 : జేమీ కోల్స్, మసన్ క్రనే, జోష్ హల్, ఎడీ జాక్, బెన్ మెక్‌కిన్నే, లియాం ప్యాటర్సన్ వైట్, థామస్ రే, మాథ్యూ రెవిస్, మిచ్ స్టాన్లీ.

# స్పోర్ట్స్

## 49 ఏళ్లలో ఒకేఒక్కడు.. భారత దిగ్గజం సరసన లబూషేన్..!



సుదీర్ఘ ఫార్మాట్‌లో ఫామ్‌లేమితో విమర్శలు ఎదుర్కొంటున్న మార్నస్ లబూషేన్ దక్షిణాఫ్రికా పర్యటనలోనూ నిరాశపరుస్తున్నాడు. డర్బన్ టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పెద్ద స్కోర్ చేయలే. కానీ, 49 ఏళ్లలో ఎవరికీ దక్కని అరుదైన రికార్డు సాధించాడీ ఆసీస్ స్టార్. వరసగా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అతడు ఒకే స్కోర్ వద్ద ఔటయ్యాడు. అంతకుమించి ఆశ్చర్యపరిచే విషయం ఏంటంటే.. అతడు తొలి ఇన్నింగ్స్‌లో ఎన్ని బంతులాడాడో..దక్షిణాఫ్రికాతో డర్బన్ టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాడు మార్నస్ లబూషేన్ అర్ధ శతకం కూడా చేయలే. అయినా సరే అతడు నెట్టింట వైరలవుతున్నాడు. అందుకు కారణం.. రెండు ఇన్నింగ్స్‌ల్లో తేలిపోయిన అతడు దాదాపు 50 ఏళ్ల టెస్టు చరిత్రలో ఎవరికీ సాధ్యమవ్వని రికార్డు పట్టేశాడు. వరసగా రెండు ఇన్నింగ్స్‌ల్లో ఒకే స్కోర్ చేయడమే కాదు సమానమైన బంతులు ఎదుర్కొన్న ప్లేయర్‌గా లబూషేన్ గుర్తింపు సాధించాడు.తొలుత 58 బంతులు ఆడి 37 పరుగులు చేసిన లబూషేన్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ 58 బంతులకు 37 పరుగులే చేసి ఔటయ్యాడు. దాంతో.. భారత దిగ్గజం సయ్యద్ కీర్మాణీ తర్వాత ఈ అరుదైన ఫీట్ సొంతం చేసుకున్న బ్యాటర్‌గా ఆసీస్ స్టార్ అవతరించాడు. 1977-78 సిరీస్‌లో ఆస్ట్రేలియాపై రెండు ఇన్నింగ్స్‌ల్లో 29 రన్స్ చేశాడు. అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ 62 బంతులే ఆడడం విశేషం. రెండు ఇన్నింగ్స్‌ల్లో 5 అరుదైన ఫీట్.. భారత దిగ్గజం తర్వాత

# అతడి నిర్ణయమే ఫైనల్..

**- పెళ్లి పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన మమితా బైజు**



ప్రేమలు సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది మలయాళ భామ మమితా బై . ఇటీవలే సూర్యతో నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్ మూవీతోపాటు బెత్లెహామ్ కుటుంబ యూనిట్ సినిమాలతో మంచి హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయిన ఈ భామ పెళ్లిపై వస్తున్న పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.తాను ఎవరిని పెళ్లి చేసుకుంటాననే విషయంతోపాటు తన జీవితంలోని ప్రతీ స్టెప్‌ను తన సోదరుడు మిథున్ బైజు నిర్ణయిస్తాడని చెప్పింది మమితా బైజు. నేను, నా సోదరుడు మిథున్ బైజు స్నేహితుల కంటే ఎక్కువ. నాకు సంబంధించి ప్రతీ నిర్ణయం మిథునే తీసుకుంటాడు. నా పెళ్లి విషయంలో కూడా మిథున్ తీసుకునే నిర్ణయమే ఫైనల్. నాకు వచ్చే లవ్ ప్రపోజల్స్ ను హ్యాండిల్ చేసేది కూడా అతడే.. అంటూ కామెంట్ సెక్షన్‌లోకి ఎంట్రీ ఇచ్చిన మమితా బైజు ఏంటీ..? అని రాసి ఉన్న డైలామాతో కూడిన మినియన్ స్టిక్కర్‌ను పోస్ట్ చ్ఛ?స్తూ తన పెళ్లిపై వస్తున్న పుకార్లకు చెక్ పెట్టింది.

# ‘రామాయణ’ రెండో ట్రైలర్ దసరాకేనా..

**-అక్టోబర్ 20న మరో భారీ అప్‌డేట్!**




భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత భారీ అంచనాలు నెలకొల్పుతున్న చిత్రాల్లో ‘రామాయణ’ కూడా ఒకటి. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ పౌరాణిక గాథలో బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా కనిపించనున్నారు. అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో చిత్రానికి సంబంధించిన రెండో థియేట్రికల్ ట్రైలర్‌ను దసరా సందర్భంగా విడుదల చేయనున్నారనే ప్రచారం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.‘రామాయణ’ చిత్రానికి సంబంధించిన రెండో ట్రైలర్‌ను అక్టోబర్ 20, 2026న విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే రోజున ప్రపంచవ్యాప్తంగా ముందస్తు టికెట్ విక్రయాలు కూడా ప్రారంభం కానున్నాయని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే రెండో ట్రైలర్ విడుదల తేదీపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. దసరా పండుగ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేస్తే సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా శ్రీరాముడి శక్తి, రావణుడి భీకరమైన రూపాన్ని ప్రధానంగా చూపిస్తూ ఈ కొత్త ట్రైలర్‌ను రూపొందిస్తున్నారనే వార్తలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే ట్రైలర్‌లో ఉండబోయే సన్నివేశాల వివరాలపై కూడా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో నటిస్తుండగా, సాయిపల్లవి సీతాదేవిగా కనిపించనున్నారు. ఇక ‘కేజీఎఫ్’ చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న యశ్.. రావణుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ ముగ్గురు ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనుండటంతో సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచే అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి.శ్రీరాముడి ధర్మం, రావణుడి శక్తి, సీతాదేవి పాత్ర చుట్టూ సాగే కథను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరపైకి తీసుకురావడమే చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రణ్‌బీర్, యశ్ పాత్రల రూపకల్పన ఎలా ఉండబోతోందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. యశ్ కూడా నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం.

# రామ్ చరణ్ -- అనిరుధ్ కాంబినేషన్ ఫిక్స్..

**-క్రేజీ కాంబోపై భారీ అంచనాలు!**




టాలీవుడ్‌లో ప్రస్తుతం స్టార్ హీరోల సినిమాలకు సంగీతం అందించే విషయంలో అనిరుధ్ రవిచందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తనదైన సంగీతంతో దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఈ యువ సంగీత దర్శకుడు.. ఇప్పుడు మెగా అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఓ క్రేజీ కాంబినేషన్‌లో భాగం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న సినిమాకు అనిరుధ్ సంగీతం అందించనున్నారనే వార్త ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.రామ్ చరణ్‌కు టాలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. మరోవైపు అనిరుధ్ రవిచందర్ తన సంగీతంతో భారీ సినిమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఆయన స్వరపరిచిన పాటలు, నేపథ్య సంగీతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో చరణ్ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి చాలాకాలంగా అభిమానుల్లో ఉంది. ఇప్పుడు రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న చిత్రానికి అనిరుధ్ పేరు వినిపిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. అయితే ఈ కాంబినేషన్‌పై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రామ్ చరణ్, అనిరుధ్ కలిసి పనిచేయాల్సిన అవకాశం గతంలోనే వచ్చినట్లు తెలుస్తోంది. చరణ్ నటించిన యాక్షన్ చిత్రం ‘బ్రూస్ లీ’కి తొలుత అనిరుధ్‌ను సంగీత దర్శకుడిగా ఎంపిక చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే చివరకు ఆ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. అప్పట్లో రామ్ చరణ్‌తో కలిసి పనిచేయాలనే ఆసక్తిని అనిరుధ్ సామాజిక మాధ్యమాల్లో కూడా వ్యక్తం చేసినట్లు అభిమానులు గుర్తుచేస్తున్నారు. దీంతో వీరిద్దరి కలయిక ఎప్పుడు సాధ్యమవుతుందనే చర్చ అప్పటి నుంచే కొనసాగుతోంది. ఇప్పుడు సుకుమార్ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కోసం ఈ కాంబినేషన్ కుదిరిందనే ప్రచారం రావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# అమ్మాయి షూటింగ్‌కి బయలుదేరింది

ఆ సినిమా తర్వాత రెండేండ్లపాటు నటనకు దూరంగా ఉన్న నివేదా.. మళ్లీ కెమెరా ముందుకు రానున్నది. ‘శ్రీమతి’ అనే ఫ్యామిలీ డ్రామాలో ఆమె నటించనున్నారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకుడు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈచిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానున్నది. ఈ కొత్త ప్రయాణం గురించి నివేదా థామస్ తన సోషల్ మీడియా వేదికగా స్పందించింది. ‘అంతా సిద్ధమైంది.. ఓ కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నాను.ఇది నాకు తెలిసిన ప్రపంచమే అయినప్పటికీ ఎంతో అవసరమైనదీ.. ప్రత్యేకమైనది. కొత్త సినిమా సెట్‌లో మొదటి రోజు దగ్గర పడుతుండటంతో నాలో ఓ రకమైన ఆందోళనగా భయంగా ఉంది. ఇది ఆతృత కాదు. పని మొదలుపెట్టాలనే ఉత్సాహం. ఓ అమ్మాయి సినిమా చిత్రీకరణ కోసం బయలుదేరింది’ అని నివేదా పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.

# డ్యాన్స్ షో ఆఫర్ వస్తే అనుపమ పరమేశ్వరన్ షాకయ్యిందట..



రింగురింగుల జుట్టుతో కుర్రకారు మనసులో చెరగని ముద్రవేసుకుంది కేరళ చిన్నది అనుపమ పరమేశ్వరన్. మలయాళంతోపాటు తెలుగు, తమిళ భాషల్లో స్టార్ యాక్టర్లతో కలిసి నటిస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఈ బ్యూటీని ఒక ఆఫర్ సర్‌ప్రైజ్ చేసిందట. ఇంతకీ ఏ సినిమానో అనుకుంటున్నారా..? కాదండి.. అనుపమకు ఓ పాపులర్ డ్యాన్స్ రియాలిటీ షో నుంచి ఆఫర్ వచ్చింది. తెలుగు రియాలిటీ డ్యాన్స్ షో ‘ఢీ’ నయా సీజన్‌కు జడ్జిగా చేయాలని ఆఫర్ రావడంతో షాకయ్యానని చెప్పింది అనుపమ.ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో అనుపమ మాట్లాడుతూ.. సినిమాలకు అతీతంగా కొత్త అవకాశాలను అన్వేషించడం తనకు ఇష్టమని చెప్పింది. సినిమాలో తన మార్క్ చూపించిన తర్వాత షార్ట్ ఫిల్మ్, మ్యూజిక్ వీడియోల్లో నటించే అవకాశాలు వచ్చాయని... ఢీ షోకు జడ్జిగా చేయాలనే ఆఫర్ వస్తుందని తానెప్పుడు ఊహించలేదని, డిఫరెంట్ ఫార్మాట్లలో ప్రయోగాలు చేయడాన్ని ఎంజాయ్ చేయడం వల్ల తాను షో చేసేందుకు ఒప్పుకున్నానని చెప్పుకొచ్చింది. ఎప్పుడైనా కొంతగా ప్రయత్నించే ఆసక్తికరమైన అవకాశాలు వస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానంది అనుపమ. డ్యాన్స్ షోకు జడ్జిగా చేయాలని అనుపమ నిర్ణయించుకోవడం కొత్త అనుభవాలను ఆవిష్కరించుకోవాలనే తన తపనను ప్రతిబింబిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి డ్యాన్స్ రియాలిటీ షోకు జడ్జిగా ప్రేక్షకుల దగ్గర అనుపమ ఎలాంటి మార్కులు కొట్టేస్తుందనేది చూడాలి.

# సర్దార్ డైరెక్టర్‌తో యశ్ సినిమా..

## క్రేజీ టాక్ నిజమయ్యేనా..?



కార్తీ హీరోగా నటించిన సర్దార్ సినిమాతో మంచి హిట్ అందుకున్నాడు కోలీవుడ్ డైరెక్టర్ పీఎస్ మిత్రన్. అయితే భారీ అంచనాల మధ్య వచ్చిన సీక్వెల్ ప్రాజెక్ట్ సర్దార్ 2 మాత్రం బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయింది. తాజాగా ఈ తమిళ దర్శకుడికి సంబంధించిన క్రేజీ వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. పీఎస్ మిత్రన్ ఇండియానా జోన్స్ ఫ్రాంచైజీ స్ఫూర్తిగా ఓ ఎక్సయిటింగ్ అడ్వెంచరస్ ఫిల్మ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడట.ఇందులో కన్నడ స్టార్ యాక్టర్ యశ్ హీరోగా కనిపించబోతున్నాడట. తాజా టాక్ ప్రకారం పీఎస్ మిత్రన్ యశ్ కథ వినిపించగా.. సినిమా ఐడియా యశ్‌కు బాగా నచ్చిందని ఇన్‌సైడ్ టాక్. ఇందులో యశ్ చాలా కొత్త గెటప్‌లో కనిపించబోతున్నాడట. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే ఈ ఇద్దరి కాంబో సెట్స్‌పైకి వెళ్లడం పక్కా అని తెలుస్తోండగా.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. యశ్ ప్రస్తుతం నితేశ్ తివారి తెరకెక్కిస్తున్న రామాయణ సినిమాలో నటిస్తున్నాడు. ఇందులో రావణుడిగా కనిపించబోతున్నాడు యశ్. దీంతోపాటు యశ్ ప్రస్తుతమున్న ఇతర సినిమాల కమిట్‌మెంట్స్ పూర్తి చేసిన తర్వాత పీఎస్ మిత్రన్ ప్రాజెక్టు ముందుకు కదలనుందనే చర్చ నడుస్తోంది. మరి యశ్–పీఎస్ మిత్రన్ కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పైకి రావాలంటే ఎన్నాళ్లు వేచి ఉండాలో మరి.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831